# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సంపుటి: 01,సంచిక: 171, పేజీలు: 08 వెల : రూ.5/- శుక్రవారం - 13 - ఫిబ్రవరి - 2026

Published From vijayawada: Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad






ముఖ్యమంత్రి చంద్రబాబును

## కలిసిన బండ్ల గణేశ్

- చంద్రబాబు సీఎం కావాలని మొక్కుకుని తిరుమలకు పాదయాత్ర చేసిన బండ్ల గణేశ్
- 23 రోజుల్లో 535 కిలోమీటర్ల మేర సాగిన సంకల్ప యాత్ర
- మొక్కు చెల్లించుకున్న అనంతరం సీఎంకు శ్రీవారి ప్రసాదం అందజేత
- పాదయాత్ర అనుభవాలను ముఖ్యమంత్రితో పంచుకున్న బండ్ల గణేశ్

## విద్యాసంస్థల్లో వసతులకు ప్రతిపాదనలు.. త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్


2లో

- రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపాం
- పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదు

# విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్య

**ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం**

- ★ పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- ★ విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్
- ★ ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు
- ★ పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి



అమరావతి: "నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని మిగతా..2లో

# 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు..

## తెలంగాణలోనూ అప్పుడే: సీఎం రేవంత్‌రెడ్డి



దిల్లీ: దేశ వ్యాప్తంగా 2029 ఏప్రిల్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయని, అప్పుడే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో కేంద్రమంత్రులను కలిసిన అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు బుల్లెట్ రైలు వచ్చిందని, హైదరాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు ఫ్యూచర్ సిటీ, ఎయిర్‌పోర్టు సమీపంలో 500-700 ఎకరాలు ఇవ్వాలనుకుంటున్నట్టు చెప్పారు. "ఎన్టీఆర్ జాతీయ నాయకుడు.. అమీర్‌పేటలో ఆయన విగ్రహం పెట్టి తీరుతాం. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రతిపాదిస్తా. నూటికి నూరు శాతం మా ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ లేదు. నాలుగు గోడల మధ్య జరిగే వ్యవహారం నాకు అవసరం లేదు. నేను ప్రజల అభిప్రాయం మాత్రమే తెలుసుకుంటాను. ఎస్ఐబీ ఫిర్యాదుతోనే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుగుతోంది. కిషన్‌రెడ్డి లేఖ రాస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా సీబీఐకి ఇస్తాం. నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. 2018లో తెచ్చిన నిబంధనల మేరకే సింగరేణిలో టెండర్లు. సింగరేణి టెండర్లపై ప్రతి డాక్యుమెంట్‌ను అసెంబ్లీలో పెడతాం. ఆరోపణలు తప్పని తేలితే కిషన్‌రెడ్డి క్షమాపణలు చెబుతారా? సింగరేణి సంస్థ అప్పులు మా హయాంలో పెరగలేదు. సింగరేణికి కేసీఆర్ పెట్టిన బకాయిలే ఎక్కువ. సింగరేణి విషయంలో కేసీఆర్‌ను కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదు" అని అన్నారు.



## రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

'తెలంగాణకు బీఆర్ఎసే శ్రీరామరక్ష'

తెలంగాణ ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయి, అన్నీ గమనిస్తున్నారు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే బిఆర్ఎస్ బలంగా ఉంది

'ఈ రాష్ట్రానికి కాంగ్రెస్, బిజెపి చేసింది ఏం లేదు

వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి అని పెద్దలు చెప్తారు

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు అన్నీ అర్థమవుతున్నాయని, అన్నీ గమనిస్తున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ మిగతా..2లో


## గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు రండి..



**రాజ్‌నాథ్‌కు రేవంత్ ఆహ్వానం**

దిల్లీ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్రమంత్రిని సీఎం ఆహ్వానించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో దీన్ని చేపడుతున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు రాజ్‌నాథ్‌కు రేవంత్ వివరించారు.

## పవన్ కల్యాణ్‌ను కలిసిన నందమూరి బాలకృష్ణ, నాగబాబు!


2లో

- ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో పవన్ కల్యాణ్‌తో మర్యాదపూర్వక భేటీ
- పవన్ కల్యాణ్‌తో మొదట బాలకృష్ణ, ఆ తర్వాత నాగబాబు

## బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి: కవిత


2లో

తెలంగాణ వచ్చినా ఉద్యమకారుల కుటుంబాలకు అన్యాయం జరిగిందన్న కవిత

బడ్జెట్ లో ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్

## తెలంగాణ పంచాయతీలకు శుభవార్త... కేంద్రం నుంచి రూ.387 కోట్లు విడుదల

వారం క్రితం తొలి విడతలో రూ.259.63 కోట్లు విడుదల



హైదరాబాద్: తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. వారం రోజుల క్రితం తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదల చేసింది. తాజాగా మరోసారి విడుదల చేయడంతో రెండు విడతల్లో కలిపి రూ.646.46 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్టయింది. ఈ నిధులతో, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు మరో రూ.2,400 కోట్ల నిధులు రావాల్సి ఉంది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండటానికి పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మంత్రి సీతక్క కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి విడతలుగా నిధులు వస్తున్నాయి.

# మండలిలో మాటల యుద్ధం..

**బొత్స, మంత్రి పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!**

ఏపీ శాసనమండలిలో సంక్షేమ పథకాలపై తీవ్ర వాగ్వాదం

ప్రభుత్వ వాదనలు అబద్ధమని, నిరూపిస్తే క్షమాపణ చెబుతానని బొత్స సవాల్

బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి ప్రతిసవాల్

అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపై ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం

పింఛన్ల తొలగింపు ఆరోపణలపై వివరణ ఇచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, మిగతా..2లో

## అదే ఊపుతో ముందుకెళ్లాలి


2లో

న్యూఢిల్లీ: రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. దీంతో ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని ఖర్గే చెప్పారు. రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. మిగతా..2లో



## నిన్న 'అథెంటికేషన్', ఈ రోజు ప్రివిలేజ్'...

మీడియాపై రాహుల్ గాంధీ అసహనం

మీడియా ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ

ప్రివిలేజ్ మోషన్ గురించి ప్రశ్నించడంతో అసహనానికి గురి

'ప్రివిలేజ్' అన్నది ఈరోజు మీ కోడ్ వర్డ్ అంటూ ఘాటు వ్యాఖ్య

నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వృత్తి గౌరవాన్ని కాపాడాలని మీడియాకు సూచన

ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో రాహుల్‌పై చర్యలకు బీజేపీ యోచన

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ మీడియా ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అధికార పక్షం ప్రివిలేజ్ మోషన్ (సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం) ప్రవేశపెట్టే మిగతా..2లో

## పవన్ కల్యాణ్‌ను కలిసిన నందమూరి బాలకృష్ణ, నాగబాబు!

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు వేర్వేరుగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి ఛాంబర్‌లో బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు ప్రస్తుత పరిణామాలు, వివిధ అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఆ తర్వాత నాగబాబు కూడా సోదరుడిని కలిశారు. అంతకుముందు, శాసనసభలో మంత్రి లోకేశ్, నందమూరి బాలకృష్ణ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. బాలకృష్ణ ఏదో చెబుతుండగా లోకేశ్ ఆసక్తిగా వింటున్నట్లు కనిపించింది. ఇదిలా ఉండగా, గిద్దలూరు నియోజకవర్గం సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.

## చంద్రుడిపై గల్లంతైన నాటి స్పేస్ క్రాఫ్ట్ మిస్టరీని తేల్చేసిన కృత్రిమ మేధ!

ఢిల్లీ: చంద్రుడిపై విజయవంతంగా దిగిన తొలి మానవరహిత స్పేస్ క్రాఫ్ట్ 'లూనా 9' ఆచూకీని ఎట్టకేలకు గుర్తించామని అంతరిక్ష పరిశోధకులు తాజాగా వెల్లడించారు. 1966 ఫిబ్రవరి 3న అప్పటి సోవియట్ యూనియన్ ఈ స్పేస్ క్రాఫ్ట్ ను అంతరిక్షంలోకి పంపించింది. చంద్రుడిపై విజయవంతంగా దిగిన ఈ వ్యోమనౌక.. చంద్రుడి ఉపరితలానికి సంబంధించి కీలకమైన వివరాలను పంపించింది. అయితే, ఇది కేవలం మూడు రోజుల పాటే పనిచేసింది. ఆ తర్వాత ఆచూకీ లేకుండా పోయింది. ఈ స్పేస్ క్రాఫ్ట్ 'ఓసియానస్ ప్రొసెల్లారమ్' రీజియన్ లో ల్యాండైందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, వ్యోమనౌక దిగిన కచ్చితమైన లొకేషన్ ను గుర్తించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. 1966 నుంచి ఈ విషయంపై శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఈ చిక్కుముడిని విప్పేసిందని యూకే, జపాన్ పరిశోధకులు తెలిపారు. నాసా తీసిన చిత్రాలను పరిశీలించి.. లూనా 9 చంద్రుడిపై దిగి గల్లంతైన చోటును ఏఐ గుర్తించిందని వివరించారు. ఓసియానస్ ప్రొసెల్లారమ్ రీజియన్ లో లూనా 9 దిగినట్లు భావిస్తున్న కొన్ని లొకేషన్లను ఎంపిక చేసిందని, ఈ ఫలితాలపై మరిన్ని పరిశోధనలు జరిపి కచ్చితమైన లొకేషన్ ను గుర్తిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భారత్ కు చెందిన చంద్రయాన్ 2 ఆర్బిటర్ ద్వారా ఈ లొకేషన్లను పరీక్షించి చూస్తామని వివరించారు.

## బంగ్లాదేశ్ ఎన్నికలు... ఢాకాలో ఓటు హక్కును వినియోగించుకున్న ముహమ్మద్ యూనస్

బంగ్లాదేశ్ : ఏడాదికి పైగా తీవ్ర రాజకీయ అనిశ్చితిలో ఉన్న బంగ్లాదేశ్ లో ఈరోజు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర క్రితం షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ఆ దేశం రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పటి నుంచి ఆ దేశ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. మహమ్మద్ యూనస్ ఢాకాలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల తర్వాత బంగ్లాదేశ్ లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 1,981 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. సుమారు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ ను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించిన సంగతి తెలిసిందే. దీంతో, ఆ పార్టీ లేకుండానే తొలిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాతే ఇస్లామీ కూటమి మధ్య ఉంది. షేక్ హసీనా ప్రస్తుతం ఇండియాలో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత ఆ దేశంలో హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు పలువురు హిందువులను దారుణంగా హత్య చేశారు. ఈ ఎన్నికల్లో జమాతే ఇస్లామీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే హిందువులపై దాడులు మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## హసీనా శకం ముగిశాక బంగ్లాదేశ్‌లో తొలిసారి నేడు ఎన్నికలు

బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో 13వ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రారంభమైంది. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న షేక్ హసీనా ప్రభుత్వం 2024లో భారీ విద్యార్థి ఉద్యమంతో కూలిపోయిన తర్వాత జరుగుతున్న తొలి జాతీయ ఎన్నికలు ఇవి. ప్రస్తుతం నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలు బంగ్లాదేశ్ భవిష్యత్తుతో పాటు భారత్‌కు కూడా అత్యంత కీలకంగా మారాయి. ఈ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ), ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాతే ఇస్లామీ నేతృత్వంలోని కూటముల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత తిరిగి దేశానికి వచ్చిన తారిఖ్ రెహమాన్ బీఎన్‌పీకి నాయకత్వం వహిస్తూ ప్రధాని పదవికి ప్రధాన పోటీదారుగా ఉన్నారు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడంతో ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా ప్రభుత్వ పతనం తర్వాత బంగ్లాదేశ్‌తో భారత్ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 నాటి ఆందోళనల్లో నిరసనకారుల మృతికి సంబంధించిన కేసులో హసీనాకు మరణశిక్ష విధించినా, ఆమెను తమకు అప్పగించేందుకు భారత్ నిరాకరించడం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. మరోవైపు, యూనస్ మధ్యంతర ప్రభుత్వం చైనా, పాకిస్థాన్‌లతో సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ ఎన్నికలను భారత్ నిశితంగా గమనిస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7:30 గంటలకు పోలింగ్ మొదలైంది. మొత్తం 300 స్థానాలకు గాను, ఒక అభ్యర్థి మరణంతో 299 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల భద్రత కోసం సుమారు 9 లక్షల మంది సిబ్బందిని మోహరించారు. ఈ ఎన్నికలతో పాటే 'జులై చార్టర్'గా పిలిచే రాజకీయ సంస్కరణలపై ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరుగుతోంది. సాయంత్రం 4:30 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభించి, శుక్రవారం నాటికి ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది.

## అదే ఊపుతో ముందుకెళ్లాలి

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలు, విజయావకాశాలపై సుమారు 30 నిమిషాల పాటు నేతలు చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ వంటి అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలు పార్టీకి కలిసివస్తాయని రేవంత్ వివరించారు. 70 శాతానికిపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని చెప్పారు. గెలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల్లో బీసీ సామాజిక వర్గం, మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కూడా ఖర్గే, రేవంత్ చర్చించినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొద్దిసేపు ఖర్గే, రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయినట్లు తెలిసింది.

### బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

ఇటీవల రాజకీయ, పాలనా పరమైన అంశాలు బయటకు రావడంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ యంత్రాంగం, ప్రభుత్వం మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూసుకోవాలని, నేతల మధ్య విభేదాలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని రేవంత్‌కు ఖర్గే హితబోధ చేసినట్లు సమాచారం. అదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. ఒకవైపు బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ ఖర్గే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

## బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయి: కవిత

హైదరాబాద్: కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమం సాగినప్పుడు ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని భావించామని... కానీ రాష్ట్రం వచ్చాక తీరని అన్యాయం జరిగిందని కేసీఆర్ కుమార్తె, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో కవిత మాట్లాడుతూ... ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం తెలంగాణ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చినా చేదు జ్ఞాపకాలే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరి మురళి వంటివారు రేవంత్‌తో కలవడంతోనే తాము కాంగ్రెస్‌ను నమ్మామని... కానీ రెండున్నరేళ్లుగా ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. బడ్జెట్ లో హామీలకు సంబంధించిన నిర్ణయాలు లేకపోతే కోదండరామ్ ను ప్రశ్నిస్తామని హెచ్చరించారు. త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతామని కవిత ప్రకటించారు. అది పక్కా రాజకీయ పార్టీ కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే పార్టీ అని స్పష్టం చేశారు. సహనశీలత లేకపోవడం, అహంకారం కారణంగానే బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని, మంచితనం, భోళాతనం తెలంగాణ తత్వమని చెప్పారు. అవి కోల్పోతే మనల్ని మనం కోల్పోయినట్టేనని అన్నారు. ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల వైపే ధర్మం ఉందని, వారి కోసం పోరాటం చేస్తామని కవిత ప్రకటించారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో తెలంగాణ బిడ్డలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జయశంకర్ సార్ విగ్రహం కేబీఆర్ పార్క్‌లో లేదా ట్యాంక్ బండ్‌పై పెట్టాలని అప్పట్లో మున్సిపల్ శాఖ మంత్రిని ఎన్నోసార్లు అభ్యర్థించినా సాధ్యం కాలేదని అన్నారు.

## హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఇజూ), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు. వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఫేజ్1 బీలో ఉస్మాన్‌సాగర్ గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి

హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లూ మూసీ అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారిన భూ సమీకరణకు మార్గం సుగమమైంది. నది సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియను ప్రారంభించింది. హైదరాబాద్ జిల్లాలోని గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో సుమారు 55 ఎకరాల భూములను సేకరించనుంది. ఈమేరకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. భూ నిర్వాసితులకు భూ బదలాయింపు హక్కు (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్‌టీడీఆర్) రూపంలో పరిహారం అందించాలని నిర్ణయించారు. సుందరీకరణలో సీఎం రేవంత్ లక్ష్యానికి అనుగుణంగా.. బాపూఘాట్ ప్రాంతాన్ని గాంధీ సరోవర్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశలో జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల నుంచి బాపూఘాట్ వరకు అభివృద్ధి చేయనున్నారు. ఫేజ్1ఏలో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కి.మీ., ఫేజ్1బీలో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ చేపట్టి.. నదికి రెండు వైపులా మొత్తం 21 కి.మీ. మేర అభివృద్ధి చేయనున్నారు. పరీవాహక ప్రాంతంలో సరైన రెవెన్యూ పత్రాలు, పట్టా భూములున్న వారికి టీడీఆర్ సర్టిఫికెట్లను అందజేయనున్నారు. ఘన, జల వ్యర్థాలతో నిండిపోయిన నదిని మొదట శుభ్రం చేస్తారు. 2 మీటర్ల లోతు వ్యర్థాలు, పూడిక తీస్తారు. ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తారు. చుట్టూ మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను మళ్లించి.. 24/7 నదిలో పారేలా సుందరీకరిస్తారు. నడక మార్గాలు, సైకిల్ ట్రాక్‌లు, భూగర్భ జలాల రీచార్జ్ కోసం పార్క్‌లు, వర్షపు తోటలు, గ్రీన్‌రూఫ్‌లు, బ్యాటరీ వాహనాలు, ఎలక్ట్రిక్ రిక్షాలు వంటివి ఉంటాయి. నైట్ ఎకానమీలో భాగంగా అమ్యూజ్‌మెంట్‌పార్క్, వాటర్ ఫాల్స్, చిల్డ్రన్స్ వాటర్ స్పోర్ట్స్, వీధి వర్తకుల వ్యాపార సముదాయాలు, వంతెనలు, వినోద కేంద్రాలు, రెస్టారెంట్లు, క్రీడా సౌకర్యాలు, వాణిజ్య, రిటైల్ స్థలాలను అభివృద్ధి చేస్తారు.

## ట్రిపుల్ ఐటీల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తాం

అమరావతి: రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లలో పూర్తిస్థాయి, శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. శాసనసభలో దీనిపై మాట్లాడిన ఆయన, ఈ క్యాంపస్‌ల అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. నిధుల కోసం ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రితో చర్చలు జరిపామని లోకేశ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'సాస్కీ' పథకం ద్వారా నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్‌లు) సిద్ధం చేస్తున్నామని, తద్వారా కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న నాలుగు క్యాంపస్‌లకు అవసరమైన నిధుల వివరాలను మంత్రి సభకు తెలియజేశారు. నూజివీడు క్యాంపస్‌లో పనులు పూర్తి చేయడానికి రూ.60 కోట్లు, అరకు వ్యాలీలో నిర్మాణాలకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. అదేవిధంగా, ఒంగోలు క్యాంపస్‌కు రెండు దశల్లో కలిపి రూ.600 కోట్లు, శ్రీకాకుళం క్యాంపస్ పనులు పూర్తి చేయడానికి రూ.300 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం శాశ్వత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలో తాత్కాలిక అకాడమీల కోసం వేర్వేరు జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ జిల్లాలో ట్రిపుల్ ఐటీ చదివే విద్యార్థులు అక్కడే తమ కోర్సును పూర్తి చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అని లోకేశ్ స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి, శాశ్వత సౌకర్యాలను ఏర్పాటు చేసి, విద్యార్థులు చేరిన క్యాంపస్‌లోనే చదువు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో, పుట్టపర్తిలో కొత్త ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేసే అవకాశంపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి, తగిన పరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన సభకు హామీ ఇచ్చారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

## మండలిలో మాటల యుద్ధం..

మొదటి పేజి తరువాయి

ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు. అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు. ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

## నిన్న 'అథెంటికేషన్', ఈ రోజు 'ప్రివిలేజ్'...

మొదటి పేజి తరువాయి

(సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం) ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న వార్తలపై ప్రశ్నించడంతో ఆయన అసహనానికి గురయ్యారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాలంటూ జర్నలిస్టులకు హితవు పలికారు. పార్లమెంట్ ప్రాంగణం వెలుపల తన కారు వద్దకు వస్తున్న రాహుల్‌ను మీడియా ప్రతినిధులు చుట్టుముట్టారు. ప్రివిలేజ్ మోషన్ గురించి స్పందన కోరగా, ఆయన ఒక్కసారిగా ఆగ్రహంతో స్పందించారు. "ప్రివిలేజ్ అనేది ఈరోజు మీ కోడ్ వర్డా? ఈ పదాన్ని మీకు ఈరోజే ఇచ్చారా? నిన్న 'అథెంటికేషన్' అన్నారు, 'ప్రివిలేజ్' అంటున్నారు. మీరేమీ పూర్తిగా బీజేపీ ఉద్యోగులు కాదు కదా. కాస్త నిష్పక్షపాతంగా పనిచేయడానికి ప్రయత్నించాలి" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. "మీడియాగా మీకు ఒక బాధ్యత ఉంది, వృత్తి గౌరవాన్ని కాపాడాలి" అని ఆయన సూచించారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. భారతమాతను, దేశ ప్రయోజనాలను విదేశీ శక్తులకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఆధారం లేని ఆరోపణలతో సభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ ఆయనపై ప్రివిలేజ్ మోషన్ తెస్తామని బీజేపీ ఎంపీలు హెచ్చరించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ రాహుల్‌కు అండగా నిలిచింది. ఇండో-యూఎస్ వాణిజ్య ఒప్పందంలో ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించే హక్కు ప్రతిపక్ష నేతకు ఉందని స్పష్టం చేసింది. కాగా, రాహుల్‌పై ప్రివిలేజ్ మోషన్ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, దీనికి బదులుగా ఆయనపై సబ్‌స్టాంటివ్ మోషన్ (వ్యక్తిగత ప్రాతిపదికన ఇచ్చే నోటీసు) ప్రవేశపెట్టే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచార

## విద్యాసంస్థల్లో వసతులకు ప్రతిపాదనలు.. త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్

అమరావతి: రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని.. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా.. వైకాపా హయాంలో టెండర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసు నమోదు

సంగారెడ్డి: ఎన్నికల సంఘం ఆదేశాలతో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై కేసు నమోదైంది. సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో జగ్గారెడ్డిపై కేసు నమోదు చేశారు పోలీసులు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారని నిన్న(బుధవారం) రాత్రి 9గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి వినయ్ కుమార్. జగ్గారెడ్డిపై బీఎన్ఎస్ 223,351,352,132,329,191(2) సెక్షన్లతో పాటు 215(1)(బి) ఫైర్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏ1గా జగ్గారెడ్డి, ఏ2గా అడ్డు అలియాస్ హమీద్‌లను చేర్చారు. దీనిపై సీఐ శివకుమార్ వివరణ ఇచ్చారు. అడ్డు అలియాస్ హమీద్ అనే వ్యక్తి పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ తీసుకుని తరచుగా వస్తుండటంతో రావొద్దని చెప్పామని సీఐ శివకుమార్ స్పష్టం చేశారు. అయినా మాట వినకుండా ఎన్నికల సిబ్బందిని బెదిరించి ప్రశాంత వాతావరణానికి ఇబ్బంది కలిగించారని, గేటు వద్ద కూడా పోలీసులు, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడన్నారు. విధి నిర్వహణలో ఉన్న సీఐ శివకుమార్ అతన్ని వారించడంతో తాను జగ్గారెడ్డి మనిషినని చెప్పాడని, తననే ఆపుతావా.. ఎన్నికలు ఎలా జరుగుతాయో చూస్తానని బెదిరించాడన్నారు. విషయం జగ్గారెడ్డికి తెలియడంతో ఆయన తన అనుచరులతో ఇంద్రానగర్ పోలింగ్ కేంద్రానికి వచ్చారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అక్కడ విషయాన్ని పెద్దది చేశారన్నారు. అంతటితో ఆగకుండా తనపై దాడి చేసేందుకు యత్నించారని సీఐ శివకుమార్ తెలిపారు.

ఇంకా జగ్గారెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదు

జగ్గారెడ్డిని పోలీసులు ఇంకా ఎందుకు అరెస్ట్ చేయలేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ ప్రశ్నించారు. నిన్న జగ్గారెడ్డితో ఉన్నది గోల్కొండ రౌడీ షీటర్లేనని, కౌంటింగ్ సందర్భంగా తమపై దాడులు జరిగే ప్రమాదముందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు రక్షణ కల్పించలని డీజీపీని కోరామన్నారు.

## రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.

మొదటి పేజి తరువాయి

తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష అని అన్నారు. శేరిలింగపల్లి నియోజకవర్గం నుంచి విజయ్‌కుమార్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడాన్ని కేటీఆర్ స్వాగతించారు. దీనిలో భాగంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే పార్టీ మారినా, కార్యకర్తలు మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. ఎమ్మెల్యే లేనప్పటికీ హైదరాబాద్ మొత్తంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోనే బిఆర్ఎస్ బలంగా ఉందన్నారు కేటీఆర్. 'ఈ రాష్ట్రానికి కాంగ్రెస్, బిజెపి చేసింది ఏం లేదు. వెట్టి పనికైనా, మట్టి పనికైనా మనోడే ఉండాలి అని పెద్దలు చెప్తారు. అందుకే ఈ రాష్ట్రానికి శ్రీ రామ రక్ష బిఆర్ఎస్ మాత్రమే. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఒకే ఒక విషయం చెప్పాను. ఓటు ఎవరికి వెయ్యాలి, ఎందుకు వెయ్యాలో ఆలోచన చెయ్యండని. గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో ఎగిరేది మాత్రం గులాబీ జెండానే. గ్రేటర్ హైదరాబాద్ లో కొందరు నాయకులు పార్టీ మారిన, కార్యకర్తలు మాత్రం బిఆర్ఎస్ లోనే ఉన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం. హైదరాబాద్ లో లా అండ్ ఆర్డర్ లేదు. కేసీఆర్ హయంలో శాంతి భద్రతలు అద్భుతంగా ఉండేవి' అని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్

అమరావతి: సినీ నిర్మాత బండ్ల గణేశ్ గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తాను మొక్కుకున్న మొక్కును ఇటీవల తిరుమలకు పాదయాత్రగా వెళ్లి చెల్లించుకున్న నేపథ్యంలో, ఈ భేటీ జరిగింది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును కలిసిన బండ్ల గణేశ్, ఆయనకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో చంద్రబాబును అక్రమ కేసుల్లో అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు బండ్ల గణేశ్ ఒక సంకల్పం తీసుకున్నారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై, తిరిగి ముఖ్యమంత్రి అయితే తిరుమలకు నడిచి వస్తానని మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, చంద్రబాబు నాలుగోసారి సీఎం కావడంతో తన మొక్కు తీర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో 'సంకల్ప యాత్ర' పేరుతో జనవరి 19న షాద్‌నగర్‌లోని తన ఇంటి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. మొత్తం 23 రోజుల పాటు 535 కిలోమీటర్లు నడిచి, ఫిబ్రవరి 10న తిరుమల చేరుకున్నారు. రెండు రోజుల క్రితం శ్రీవారిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నేడు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ ను ఆయన ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. పాదయాత్ర సాగిన తీరును, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని బండ్ల గణేశ్ ముఖ్యమంత్రికి వివరించారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం




## సుహాస్ వైవిధ్యంగా
# హే భగవాన్

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం.

# విజయ్ దేవరకొండ పెళ్లి

## పెళ్లి వీడియో స్ట్రీమింగ్ ఓటిటి హక్కులు తిరస్కరించిన రౌడీబాయ్!



టాలీవుడ్ మోస్ట్ క్రేజీ నటులుగా పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వీరి పెళ్లి వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఈ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. గతంలో నయనతార ? విఘ్నేష్ శివన్ వివాహ వీడియో స్ట్రీమింగ్ విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలు, డాక్యుమెంటరీ విడుదల కావడానికి పట్టిన సమయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ జంట అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. అలాగే తన వ్యక్తిగత జీవితంలోని అత్యంత ముఖ్యమైన వేడుకను వ్యాపారం చేయడం విజయ్‌కి ఇష్టం లేదని, అందుకే ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పెళ్లిని కేవలం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య అత్యంత ప్రైవేట్‌గా జరుపుకోవాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో వీరి వివాహం జరగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభ మయ్యాయని నెట్టింట కొన్ని వీడియోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లోనే వీరిద్దరికీ నిశ్చితార్థం పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, ఈ జంట మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఏదేమైనా, తమ అభిమాన నటీనటులు ఒకటవుతుండటంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## యువతరానికి కనెక్ట్ అయ్యే
# హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెళిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీ-యార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు. హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెళిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు చిన్ని చరణ్ మాట్లాడుతూ, ఈ సినిమా తనను మాస్ కమర్షియల్ మ్యూజిక్ డైరెక్టర్‌గా నిలబెడుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఏడేళ్ల అనుభవంతో, కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. అన్ను, వాసవి గణెళిషన్‌తో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి చరణ్-అర్జున్ సంగీతాన్ని అందించారు.

# వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్

స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.






# అప్పలసూరిగా జగపతిబాబు

ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ - జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే.



## సూర్యుడిని ముద్దు పెట్టుకున్న
# ఆ క్షణం ఆనందంగా ఉంది

ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన కృతి శెట్టి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ సినిమాతోనే బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో నిలిచిపోయింది. దీంతో ఈ క్యూట్ హీరోయిన్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా చాలా సినిమాల్లో నటించినా ఉప్పెన లాంటి హిట్ అయితే రాలేదు. దీంతో కొన్ని రోజులు తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది. ప్రజెంట్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మూవీలో నటిస్తున్న ఈ చిన్నది.. రీసెంట్‌గా స్టార్ హీరో కార్తి నటించిన 'అన్నగారు వస్తారు' మూవీతో మన ముందుకు వచ్చింది. నలన్ కుమార స్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియాలో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్‌స్టా అకౌంట్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో బ్లాక్ జెగ్గిన్‌కు గోల్డ్ కలర్ టీషర్ట్ పెయిరప్ చేసింది. హెయిర్ లీవ్ చేసుకుని ఎండలో ఎంతో ముద్దుగా చూస్తూ కనిపించింది. ఇక వాటిని షేర్ చేస్తూ.. 'సూర్యుడిని ముద్దు పెట్టుకున్న ఆ క్షణం ఆనందంగా ఉంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు క్రేజీగా ఉన్నావు బేబమ్మా, సూపర్, బ్యూటిఫుల్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



## ఎప్‌స్టీన్‌ను నియమించుకోలేదు

### గేట్స్ ఫౌండేషన్

**యూఎస్ :** జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఫైళ్లలో ఎప్‌స్టీన్, దాతృత్వ సంస్థ గేట్స్ ఫౌండేషన్ సిబ్బంది మధ్య సంభాషణ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. తాము అతడిని నియమించుకోలేదని, ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని వెల్లడించింది. "ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చే దాతలను సమకూరుస్తానని ఎప్‌స్టీన్ చెప్పడంతో ఫౌండేషన్ సిబ్బంది కొందరు అతడితో సంభాషణలు జరిపారు. అయితే తర్వాత దీనిపై ముందుకువెళ్లలేదు. ఎలాంటి నిధి ఏర్పాటు చేయలేదు. విషయం ఏదైనా సిబ్బంది అతడితో మాట్లాడటంపై చింతిస్తున్నాం" అని తన ప్రకటనలో పేర్కొంది. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, మిలిందా (గేట్స్ మాజీ భార్య) 2000 సంవత్సరంలో బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి బిల్‌గేట్స్ ఛైర్మన్‌గా ఉన్నారు. కాగా.. ఇటీవల అమెరికా ప్రభుత్వం 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయట పెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. ఈ విషయంలో ఆయన ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి.

## అమెరికాలో జాహ్నవి కందుల మృతి కేసు..

### కుటుంబానికి రూ.262 కోట్ల పరిహారం



**సియాటెల్:** అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతి చెందిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.262 కోట్లు) పరిహారం చెల్లించేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ప్రకటన విడుదల చేశారు. "జాహ్నవి కందుల మృతి అత్యంత బాధాకరం. ఈ సెటిల్మెంట్‌తో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నాం" అని సియాటెల్ అటార్నీ తమ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, దీనిపై జాహ్నవి కుటుంబం తరఫు అటార్నీ నుంచి ఇంతవరకూ స్పందన రాలేదు. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలూ గతవారం కోర్టులో దరఖాస్తు దాఖలు చేసినట్లు తెలిసింది.

**కేసు వివరాలివి..** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి (23) ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికా వెళ్లారు. సౌత్‌లేక్ యూనియన్‌లోని నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. 2023 జనవరి 23న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే.. జాహ్నవి మృతిపై జోకులు వేయడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. 'ఆమె ఓ సాధారణ వ్యక్తి.. ఈ మరణానికి విలువ లేదు' అని పోలీసు అధికారి అన్న మాటలు ఆయన బాడీ కెమెరాలో రికార్డయ్యాయి. దీనిపై అప్పట్లో భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. కెవిన్ తీరుపై అమెరికాలోనూ విమర్శలు రావడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 40ఎంపీహెచ్ జోన్‌లో ఉంది. కానీ, కెవిన్ గంటకు 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపి జాహ్నవిని ఢీకొట్టగా.. ఆమె 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.



## తుర్కియే పార్లమెంటులో గందరగోళం

### నేతల మధ్య బాహాబాహీ

**తుర్కియే :** తుర్కియే పార్లమెంటులో సభ్యులు గందరగోళం సృష్టించారు. కొత్త న్యాయశాఖ మంత్రి నియామకంపై జరిగిన ఘర్షణల్లో నేతలు పరస్పరం దాడి చేసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అయిన అకిన్ గుర్లెక్‌ను కొత్త న్యాయశాఖ మంత్రిగా.. తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ నియమించారు. గుర్లెక్ బుధవారం ప్రమాణస్వీకారానికి సిద్ధమవగా.. దాన్ని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు పోడియం వద్దకు దూసుకొచ్చాయి. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఘర్షణ చెలరేగింది. నేతలు పరస్పరం తోసుకుంటూ.. దాడి చేసుకున్నారు. పార్లమెంటులో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో.. స్పీకర్ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కొంతసేపటి తర్వాత తిరిగి సమావేశం ప్రారంభమవగా.. అధికార పార్టీ నేతలు గుర్లెక్ చుట్టూ రక్షణగా నిలబడి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. న్యాయమంత్రిత్వ శాఖకు అధిపతిగా గుర్లెక్ నియామకంపై ప్రధాన ప్రతిపక్షం రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసింది. గుర్లెక్ ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న సమయంలో సీహెచ్‌పీ సభ్యులతో సంబంధం ఉన్న అనేక కేసులను ఆయన పర్యవేక్షించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారిని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ నియామకం చేపట్టారని, ఇది న్యాయ స్వేచ్ఛను కూడా దెబ్బతీస్తుందని సీహెచ్‌పీ విమర్శలు చేసింది.

# కుమార్తెనే కిమ్ వారసురాలు

### దక్షిణ కొరియా



**ఉత్తర కొరియా :** ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తెనే ఆయన వారసురాలని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' అంచనా వేసింది. ఈ విషయాన్ని చట్టసభ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. కిమ్ జు యే భవిష్యత్తు నాయకురాలిగా నియామకానికి చేరువలో ఉన్నట్లు తెలిపింది. ఈ నెలాఖరులో అతిపెద్ద రాజకీయ సదస్సును నిర్వహించేందుకు ఉత్తర కొరియా సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. కిమ్ తన కుమార్తె కిమ్ జు యేను మొదటిసారిగా 2022లో ప్రపంచానికి పరిచయం చేశారు. 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్యోంగ్యాంగ్‌లో మరోసారి కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు హాజరవుతోంది. గత నెలలోనూ తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్'ను సందర్శించింది. ఇవన్నీ ఆమె కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి. ఉత్తర కొరియా పగ్గాలు ఆమెకే అప్పగిస్తారా? అని దక్షిణ కొరియా నిఘా అధికారులు మొదట్లో అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ దేశ సంప్రదాయవాద సంస్కృతి, పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని ఈమేరకు అంచనాకు వచ్చారు. కానీ.. దేశ మీడియాలో ఆమె ప్రముఖంగా కనిపిస్తుండటంతో పునఃసమీక్ష చేశారు. ఈ క్రమంలోనే ఆమె వారసురాలిగా నియామకం కీలక దశలో ఉన్నట్లు తెలిపారు. ఉన్నత స్థాయి సైనిక కార్యక్రమాల్లో పాల్గొనడం, కుమ్‌సుసన్ పర్యటనలో భాగం కావడం, కొన్ని విధానపరమైన విషయాల్లో తండ్రి ఆమె అభిప్రాయాలను కోరడం వంటివాటిని సంకేతాలుగా ఉదహరించినట్లు సమాచారం. దక్షిణ కొరియా నిఘా వర్గాల ప్రకారం.. కిమ్‌కు ముగ్గురు పిల్లలు. కిమ్ జు యే రెండో సంతానం. ఆమెకు 13 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణానంతరం పగ్గాలు చేపట్టారు. ఫిబ్రవరి నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలను పార్టీపరంగా ఆమోదముద్ర వేసుకునేందుకు అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## 114 రఫేల్ జెట్ల కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ :** త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పింది. రూ.3.60 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో అతిపెద్ద రక్షణ ఒప్పందానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 114 రఫేల్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదించిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కొనుగోలుకు రక్షణశాఖ నుంచి ఆమోదం లభించించడం గమనార్హం. అయితే, ఏడాది చివరి నాటికి ఈ కొనుగోళ్ల కోసం ఇరు దేశాల మధ్య అధికారిక ఒప్పందం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ 114లో 88 సింగిల్ సీట్, 26 ట్విన్ సీట్ వేరియంట్లు భారత వాయుసేనలో విధులు నిర్వర్తించనున్నాయి. అలాగే మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబ్లీ వంటి వాటి కోసం ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మాతృ సంస్థ దసో ఏవియేషన్.. భారత్‌లోని ప్రయివేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోనుంది. భారత వాయుసేన వద్ద ఇప్పటికే 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

## విదేశీ విద్య వద్దనుకుంటున్నారు

### భారతీయ విద్యార్థుల సంఖ్యలో భారీ తగ్గుదల



**న్యూఢిల్లీ :** ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. రెండేళ్లలో ఆ సంఖ్యలో 31 శాతం తగ్గుదల కనిపించింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ గణాంకాలను వెల్లడించింది. రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు ఆ శాఖ సహాయ మంత్రి సుకాంత మజూమ్‌దార్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 2023లో ఉన్నతవిద్య కోసం 9.08 లక్షల మంది భారతీయులు విదేశాలకు వెళ్లారు. 2024లో ఆ సంఖ్య 7.7 లక్షలకు తగ్గింది. 2025లో ఇంకా తగ్గి.. 6.26 లక్షలకు చేరింది. "విదేశాల్లో చదువు అనేది వ్యక్తిగత విషయం. ఆర్థికస్థోమత, బ్యాంకు రుణాలు పొందడం, ఒక ప్రత్యేక విభాగంలో అధ్యయనం చేయాలనే ఆసక్తిపై అది ఆధారపడి ఉంటుంది. విజయవంతమైన ప్రవాసీయులు భారత్‌కు ఒక ఆస్తి. వారి సామర్థ్యాన్ని వినియోగించుకునేలా ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని మంత్రి వెల్లడించారు. అలాగే భారత్‌లో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో జాతీయ విద్యావిధానం-2020 కింద ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయ స్థాయి విద్యను దేశీయంగా అందించే లక్ష్యంతో విదేశీ యూనివర్సిటీలు తమ క్యాంపస్‌లు ఏర్పాటుచేసుకోవడానికి అనుమతులు ఇస్తున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ఇప్పటివరకు 14 విదేశీ విద్యాసంస్థలు ఈ అనుమతులు అందుకున్నట్లు చెప్పారు.

## ఎర్రకోట వద్ద పేలుడు ఘటన

### జైషే హస్తం ఉందంటూ ఐరాస నివేదిక



**న్యూఢిల్లీ :** గతడాది దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్య సమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐరాస భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. "ఆంక్షలు ఉన్నప్పటికీ జైషే ముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న దిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐరాస సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటుచేసుకుంది. ఇది చాలా ఆందోళనకర పరిణామం" అని ఐరాస తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐరాస తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. జైషే, లష్కరే తయ్యిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్థాన్ పదేపదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐరాస ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయ్యింది. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడి వెనక జైషే మహ్మద్ హస్తం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి చేసుకున్న డాక్టర్ ఉమర్ నబీకి సంబంధించి ఓ వీడియోను స్వాధీనం చేసుకున్నారు. అందులో భారత్‌వ్యాప్తంగా ఆత్మాహుతి దాడులకు ఈ ముఠా కుట్రలు పన్నినట్లు తేలింది. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.



## కెనడా స్కూల్లో కాల్పులు..

### ముందుగా కుటుంబసభ్యులను చంపి..

**కొలంబియా :** కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రాంతంలోని పాఠశాల్లో కాల్పులు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ కాల్పులకు పాల్పడిన మహిళ ఓ ట్రాన్స్‌జెండర్ అని ఆమె పేరు జెస్సీవాన్ రూట్ సెలార్ (18)గా అధికారులు గుర్తించారు. ఆమె మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు వెల్లడించారు. టంబ్లర్ రిడ్జ్ సెంకడరీ పాఠశాల్లో జరిగిన కాల్పుల్లో నిందితురాలితో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారని కెనడియన్ మౌంటెడ్ పోలీస్ కమాండర్ పేర్కొన్నారు. జెస్సీ ఇదే పాఠశాలకు చెందిన మాజీ విద్యార్థిని అని వెల్లడించారు. ఆమె ఒంటరిగానే కాల్పులకు పాల్పడిందని, ఈ ఘటన వెనక ఆమె ఉద్దేశం ఏంటి అనేది ఇంకా తెలియలేదన్నారు. ఆమె మానసిక అనారోగ్యంతో బాధ పడుతుందని, చికిత్స అందించే విషయంపై స్థానిక పోలీసులు పలుమార్లు ఆమె ఇంటిని సందర్శించారని వెల్లడించారు. ఇక, గతంలో ఆమె ఇంటి నుంచి అధికారులు తుపాకీలు స్వాధీనం చేసుకున్నారని, చట్టపరమైన చర్యల తర్వాత వాటిని తిరిగి ఇచ్చేశారన్నారు. ఆమెకు తుపాకీ లైసెన్స్ ఉందని, అయితే గతేడాదే దాని గడువు ముగిసిందని వివరించారు. జెస్సీ తొలుత తన ఇంట్లో సొంత కుటుంబసభ్యుల పైనే కాల్పులకు పాల్పడిందన్నారు. ఈ ఘటనలో ఆమె తల్లి, 11 ఏళ్ల సవతి సోదరుడు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. ఆ తర్వాత స్కూల్ వద్దకువచ్చి ఆమె ఈ ఘాతకానికి పాల్పడిందన్నారు.

**కాల్పులను ఖండించిన మార్క్ కార్నీ..**

ఈ కాల్పుల ఘటనను కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఖండించారు. ఇది తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని విలేకరులతో పేర్కొన్నారు. ఈ క్రమంలో తన విదేశీ పర్యటనను కూడా ఆయన వాయిదా వేసుకున్నారు. ఈ ఘటనలోని మృతులకు అక్కడి పార్లమెంటు సంతాపం తెలిపింది.

## రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

### భాజపా ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని భాజపా ఎంపీ నిషికాంత్ దూబే డిమాండ్ చేశారు. ఈమేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్ గాంధీ, భాజపా ఎంపీల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. "రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నా రు..? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించాను. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి" అని దూబే అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధ్రువీకరణ లేదని పేర్కొన్నాయి.



## డ్రోన్‌తో మాస్ కాపీయింగ్ గుట్టురట్టు

### 17 మంది టీచర్లపై కేసు

**మహారాష్ట్ర :** పరీక్షల సమయంలో అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించడం అధికారుల విధి. కానీ, వారి కనుసన్నల్లోనే యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ కొనసాగింది. ఓ డ్రోన్ కెమెరా ఫుటేజీతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదైంది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. మహారాష్ట్రలో ఇటీవల 12వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద నిఘా కోసం అధికారులు డ్రోన్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే బీడ్ జిల్లా చౌశాలాలోని ఓ పరీక్ష కేంద్రంలో పెద్దఎత్తున మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఓ డ్రోన్ సాయంతో గుర్తించారు. 16 ఎగ్జామినేషన్ హాళ్లలోని సూపర్‌వైజర్‌లు.. కాపీయింగ్‌ను అడ్డుకోకుండా, విద్యార్థులు చూసి రాసేందుకు సాయపడుతున్నట్లు గమనించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వివేక్ జాన్సన్.. సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే పరీక్షా కేంద్రం చీఫ్ సహా 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదైంది. పొరుగునే ఉన్న ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలోనూ ఓ మాస్ కాపీయింగ్ ఘటన వెలుగుచూసింది.

# లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే.. ఎప్పటికప్పుడు వీటిని తీసుకోవాల్సిందే..!




మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరం నుండి విషాన్ని బయటకు పంపించడం, శరీర జీవక్రియలను నిర్వహించడం, జీర్ణక్రియకు మద్దతు ఇవ్వడం, శరీరానికి అవసరమైన పోషకాలను నిల్వ చేయడం ఇలా అనేక రకాల విధులను ప్రతిరోజూ నిర్విరామంగా నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం ఏ మాత్రం దెబ్బతిన్నా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. సరైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కొన్ని సులభంగా తయారు చేసుకునే పానీయాలను తీసుకోవడం ద్వారా కాలేయాన్ని శుభ్రపరుచుకోవడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పానీయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## నీరు, గ్రీన్ టీ..

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నీటిని ఎక్కువగా తాగాలి. నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడంతో పాటు శరీరం నుండి విషాలు ఎక్కువగా బయటకు తొలగిపోతాయి. అలాగే క్రీమ్, చక్కెర వంటివి లేకుండా బ్లాక్ కాఫీ తాగడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా చేయడంలో సహాయపడతాయి. దీంతో ఫ్యాటీ లివర్, సిర్రోసిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. క్రమం తప్పకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో మనకు దోహదపడతాయి.

## బీట్ రూట్, నిమ్మకాయ..

బీట్‌రూట్ రసం కూడా కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయానికి ఒక సహజ టానిక్ లాగా పని చేస్తుంది. బీట్‌రూట్ రసంలో ఉండే బీటాలైన్లు, నైట్రేట్లు కాలేయం నిర్విషీకరణ ఎంజైమ్‌లను పెంచుతాయి. బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది. అలాగే ఆకుకూరలు, క్యారెట్లు, సెలెరీ వంటి వాటితో జ్యూస్ చేసి తీసుకోవడం వల్ల కాలేయంలో డీటాక్సిఫికేషన్ ప్రక్రియతో పాటు కాలేయం ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. రోజూ ఒక గ్లాస్ నిమ్మకాయ నీరు తాగడం వల్ల కాలేయం సహజంగా శుభ్రపడుతుంది. నిమ్మకాయ నీరే అని చాలా మంది తేలికగా తీసుకుంటారు. కానీ కాలేయాన్ని శుభ్రపరచడంలో ఇది ప్రభావవంతంగా పని చేస్తుంది. అదే విధంగా ఉసిరికాయ జ్యూస్ కూడా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీనిలో విటమిన్ సితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు సహాయపడతాయి.

## కొబ్బరి నీళ్లు..

కొబ్బరి నీరు కూడా కాలేయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉంటుంది. శరీరానికి కావల్సిన ఎలక్ట్రోలైట్స్, పోషకాలు అందుతాయి. అల్లం శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అల్లం కషాయాన్ని తీసుకోవడం వల్ల వాపు తగ్గి కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీరు కూడా కాలేయానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. కాలేయంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కూడా సమర్థవంతగా జరుగుతుంది. ఇలాంటి సహజసిద్ధమైన పానీయాలను తీసుకోవడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడడంతో పాటు కాలేయ ఆరోగ్యం కూడా సరిగ్గా ఉంటుంది. ఈ పానీయాలను తాగడం వల్ల మొత్తం శరీరానికి కూడా మేలు కలుగుతుంది.

# బనానా షేక్ లేదా అరటి పండ్లు.. రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచిదా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.

## మిల్క్ షేక్ వద్దు..

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటిపండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

## జీర్ణ క్రియకు ఆటంకం..

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు. కనుక అరటిపండును నేరుగా తీసుకోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉండడంతో పాటు శరీరానికి పోషకాలు కూడా చక్కగా అందుతాయి. పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడే వారు బనానా షేక్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# ఐటీ కంపెనీలను వణికిస్తున్న ఆ 'పేరు' మాదే..

అమెరికా ఆధారిత ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్' భారత విస్తరణ ప్రణాళికలు చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అదే పేరుతో పనిచేస్తున్న భారతీయ సంస్థ 'ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్'.. తమ బ్రాండ్‌కు గందరగోళం కలుగుతోందని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ కేసు భారత కోర్టులో పెండింగ్‌లో ఉండటం వల్ల, దేశంలో ఆంత్రోపిక్ వ్యూహాత్మక ప్రణాళికలు క్లిష్టతరం అయ్యే అవకాశముంది.

## అమెరికా ఆంత్రోపిక్ ఎం ఇండియా ఆంత్రోపిక్

టెక్ క్రంచ్ నివేదిక ప్రకారం.. ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ గత నెలలో కర్ణాటక వాణిజ్య కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది. 2017 నుంచే తమ సంస్థ "ఆంత్రోపిక్" పేరును ఉపయోగిస్తోందని, అమెరికా సంస్థ భారత మార్కెట్లో ప్రవేశించడం వల్ల వినియోగదారుల్లో గందరగోళం ఏర్పడుతోందని కంపెనీ పేర్కొంది. స్థానిక సంస్థ తన ముందస్తు వినియోగాన్ని అధికారికంగా గుర్తించాలని, అలాగే మరింత గందరగోళం నివారించేందుకు తగిన ఉపశమనం ఇవ్వాలని కోరుతోంది. అదనంగా, రూ.1 కోటి నష్టపరిహారం కూడా డిమాండ్ చేసినట్లు సమాచారం.





## భారతీయ సంస్థ వాదన ఏమిటంటే..

ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ మొహమ్మద్ అయ్యాజ్ ముల్లా టెక్ క్రంచ్‌తో మాట్లాడుతూ, ఈ ఫిర్యాదు వెనుక ఉద్దేశం ఘర్షణ కాదని, తమ ముందస్తు వినియోగానికి అధికారిక గుర్తింపు పొందడమేనని తెలిపారు. గుర్తింపు లభించకపోతే, చట్టపరమైన పోరాటాన్ని కొనసాగించవచ్చని ఆయన స్పష్టం చేశారు. భారతీయ సంస్థ తమ వెబ్‌సైట్‌లో "ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (అప్లికేషన్ పెండింగ్) ట్రేడ్‌మార్క్" అని పేర్కొంది. ట్రేడ్‌మార్క్ నమోదు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, ఇది నేరుగా ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన కేసుగా పరిగణించబడకపోవచ్చు. అయితే కోర్టు భారతీయ సంస్థకు అనుకూలంగా తీర్పు ఇస్తే, అమెరికా సంస్థ భారతదేశంలో తన పేరును మార్చాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశముంది.

## కేసు ప్రస్తుత స్థితి

జనవరి 20న కోర్టు ఆంత్రోపిక్ ఇండియాకు సమన్లు జారీ చేసింది. అయితే ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. అంటే, సంస్థ తన కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాల్సిన అవసరం లేదు. తదుపరి విచారణ ఫిబ్రవరి 16న జరగనుంది. ఇదిలా ఉండగా, ఆంత్రోపిక్ ఏఐ భద్రతా విభాగాధిపతి మృణక్ శర్మ రాజీనామా చేశారు. ఇటీవల 'ఎక్స్' (ట్విట్టర్)లో తన రాజీనామాను ప్రకటించారు. తాను వెంటనే కొత్త వెంచర్ ప్రారంభించడం లేదని, తదుపరి నిర్ణయం తీసుకునే ముందు స్వల్ప విరామం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు.

# గుడ్డులోని పచ్చ సొనను తినాలా.. వద్దా.. వైద్యులు ఏమని చెబుతున్నారు..?



మన శరీరానికి కావల్సిన పోషకాలను అందించే ఆహారాల్లో గుడ్డు ఒకటి. దీనిలో ప్రోటీన్స్, ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. గుడ్డును తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. గుడ్డును తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని చాలా మంది గుడ్డు తెల్లసొనను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. పచ్చసొనను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం వాస్తవమే అయినప్పటికీ గుడ్డు పచ్చసొనను తీసుకోవడం వల్లే మన శరీరానికి ఎక్కువ పోషకాలు అందుతాయని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు పచ్చసొనలోనే విటమిన్ ఎ, ఇ, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు. ఆరోగ్యవంతులు గుడ్డు పచ్చసొనను ఆహారంగా తీసుకోవచ్చని ఇది శరీరానికి శక్తిని అందించే పోషక కేంద్రం లాంటిదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

## అనుకున్నంత హానికరం కాదు..

అంతేకాకుండా తాజా పరిశోధనలు గుడ్డు పచ్చసొనలో ఉండే కొలెస్ట్రాల్ మన రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపిస్తుందని తెలియజేస్తున్నాయి. పచ్చసొనను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగితే అవి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలే అయి ఉంటాయని చెడు కొలెస్ట్రాల్ పై ఇవి ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు పచ్చసొనను మితంగా తీసుకోవడం వల్ల రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ స్థాయిలపై పెద్దగా ప్రభావం ఉండదని గుడ్డు పచ్చసొనలో ఉండే కొలెస్ట్రాల్ అనుకున్నంత హానికరం కాదని వారు తెలియజేస్తున్నారు. పచ్చసొన పోషకాలతో నిండి ఉంటుందని ఇది ఆరోగ్యకరమైనదని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు తెల్లసొన ఒక శోథ నిరోధక ప్రోటీన్ అని కేవలం తెల్లసొనను తీసుకోవడం అంత మంచిది కాదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

## ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్..

కొలెస్ట్రాల్ గురించి తప్పుడు అభిప్రాయాన్ని కలిగి ఉండడం వల్ల చాలా మంది గుడ్డు పచ్చసొనను ఆహారంగా తీసుకోవడం లేదని వైద్యులు అంటున్నారు. మన శరీరంలో కణ నిర్మాణానికి, హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు పనితీరుకు, రోగనిరోధక వ్యవస్థకు కొలెస్ట్రాల్ చాలా అవసరం. దాదాపు 85 శాతం కొలెస్ట్రాల్ ను మన శరీరంలో ఉండే కాలేయమే తయారు చేస్తుంది. కొలెస్ట్రాల్ లో కూడా తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్ (ఎల్‌డిఎల్), అధిక సాంద్రత కలిగిన లిపో ప్రోటీన్( హెచ్‌డిఎల్) అని రెండు రకాలు ఉంటాయి. ఎల్‌డిఎల్ అధిక స్థాయిల ఉండడం వల్ల ధమనులలో అడ్డంకులు ఏర్పడి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. కనుక దీనిని చెడు కొలెస్ట్రాల్ అంటారు. హెచ్‌డిఎల్ ని మంచి కొలెస్ట్రాల్ అని అంటారు. ఇది ధమనుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను కాలేయానికి తీసుకెళ్లి శరీరం బయటకు వెళ్లేలా చేస్తుంది.

## ఇవి కూడా అవసరమే..

ఇక శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి గుడ్డు పచ్చసొన కారణం కాదని అధిక సంతృప్త కొవ్వులు ఉండే ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం, ధూమపానం వంటి కారణాల వల్లే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు పచ్చసొనను పూర్తిగా మానేయకుండా దీనిని మితంగా తీసుకుంటూనే సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, శారీరక శ్రమ ఉండేలా చూసుకోవడం, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండడం, ధూమపానం మానేయడం వంటివి చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు సలహా ఇస్తున్నారు. గుడ్డు పచ్చసొన ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ దీనిని మితంగా తీసుకోవాలి. అలాగే గుండె జబ్బులు ఉన్న వారు, దయాబెటిస్ రోగులు, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు, గౌట్ సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# డయాబెటిస్ ఉన్నవారికి అద్భుతంగా పనిచేసే మూలికలు..



మారిన జీవనవిధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల్లో దయాబెటిస్ కూడా ఒకటి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్య బారిన పడుతున్నారు. దయాబెటిస్ బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిందే. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడం వల్ల శరీరంలో ఇతర అవయవాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కనుక దయాబెటిస్ ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని రకాల మూలికలను వాడడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడడంతో పాటు తీపి తినాలన్న కోరిక కూడా తగ్గుతుందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ మూలికలను తీసుకోవడం వల్ల అడాప్టోజెన్ ఒత్తిడి తగ్గడంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచే మూలికలు ఏమిటో.. ఇప్పుడు తెలుసుకుందాం.

## మెంతులు, దాల్చిన చెక్క..

రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో మెంతులు మనకు ఎంతో సహాయపడతాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది చక్కెర శోషణను నెమ్మదిస్తుంది. మెంతులను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీతో పాటు ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు, శరీర జీవక్రియ కూడా మెరుగుపడుతుంది. క్రమం తప్పకుండా మెంతి నీటిని తీసుకోవడం, మెంతులను నానబెట్టి తీసుకోవడం, వంటల్లో మెంతులను వాడడం వల్ల టైప్ 2 దయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోజూ అర టీ స్పూన్ దాల్చిన చెక్క పొడిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సామర్థ్యం పెరుగుతుంది. భోజనం తరువాత వచ్చే గ్లూకోజ్ స్పైక్స్ తగ్గుతాయి. ఓట్ మీల్, స్మూతీ, మసాలా టీ వంటి వాటితో దాల్చినచెక్క పొడిని కలిపి తీసుకోవడం వల్ల రుచిగా ఉండడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అయితే దాల్చిన చెక్క ప్రతికూల ప్రభావాలను కూడా చూపిస్తుంది కనుక దీనిని తక్కువ మోతాదులో తీసుకోవడం చాలా అవసరం.

## పొడపత్రి, కాకరకాయ..

అలాగే మధునాశిని అని పిలువబడే మూలికను తీసుకోవడం వల్ల తీపి తినాలనే కోరిక తగ్గుతుంది. దీనిని పొడపత్రి అని కూడా పిలుస్తారు. ఈ మొక్క ఆకులను నమలడం లేదా టీ లో వేసి తీసుకోవడం వల్ల చక్కెర శోషణ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కాకరకాయ కూడా మనకు సహాయపడుతుంది. పరగడుపున కాకరకాయ జ్యూస్ తాగడం వల్ల దయాబెటిస్ అదుపులో ఉంటుంది. తులసి ఆకులను నేరుగా నమలడం లేదా కషాయం చేసి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు సమతుల్యంగా ఉంటాయి. తులసి ఆకులను తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కార్టిసాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అలోవెరా జ్యూస్ ను తాగడం వల్ల ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి. పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జ్యూస్ మాత్రమే కాకుండా అలోవెరా సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.

## జాగ్రత్తలు తప్పనిసరి..

మనుపసుపు అనే మూలిక కూడా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది. దీనిని దారుహరిద్ర అని కూడా పిలుస్తారు. దీనిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. వేపను తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు సహజంగా తగ్గుతాయి. వేపను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ గ్రాహక శక్తి పెరుగుతుంది. ఈ విధమైన మూలికలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ మూలికలను తీసుకునే విషయంలో జాగ్రత్త అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ మూలికలను తీసుకోవడం నెమ్మదిగా ప్రారంభించాలి. మొదటగా ఒక్క మూలికను మాత్రమే తీసుకోవాలి. మన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తాజాగా, పొడిగా లేదా టీ రూపంలో తీసుకోవాలి. వేప, కాకర వంటి వాటిని పరగడుపున తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. దయాబెటిస్ కు ముందు నుండే మందులు వాడే వారు ఈ మూలికలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, రోజూ వ్యాయామం చేస్తూ ఈ మూలికలను తీసుకోవడం వల్ల మరిన్ని మంచి ఫలితాలను చూడవచ్చు.

### ప్రధాని మోడీ విదేశీ పర్యటనల ఖర్చు 462.58కోట్లు..

# అత్యధికం అమెరికాకే



న్యూఢిల్లీ : గత నాలుగేళ్లుగా (2021-2025)ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాల కోసం అక్షరాలా రూ. 462.58కోట్లు ఖర్చు చేసింది. 2021-2025 మధ్య ప్రధాని మొత్తం 43 దేశాలను పలుమార్లు సందర్శించారు. వీటిలో అత్యధికంగా ఖర్చు చేసింది అమెరికా పర్యటనలకే. మొత్తం వ్యయంలో 16శాతం (74.4కోట్లు) నాలుగుసార్లు అమెరికా సందర్శనలకు ఖర్చు చేశారు. వ్యయం పరంగా జపాన్, ఫ్రాన్స్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జపాన్, ఫ్రాన్స్‌ల కోసం మొత్తం వ్యయంలో సుమారు 9శాతం ఖర్చు చేశారు. 2025లో ఫ్రాన్స్ సందర్శన అత్యంత ఖరీదైన పర్యటనగా నిలవనుంది. ప్రధాని మోడీ ఒక్కరే వెళ్లిన ఈ పర్యటన కోసం సుమారు 25.5కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌లో పాల్గనడంతో పాటు మార్సెయిల్‌లో భారత రాయబార కార్యాలయాన్ని ప్రారంభించారు. 2023 జూన్‌లో అమెరికా పర్యటనకు రూ.22.8కోట్లు వ్యయం కాగా, 2021 సెప్టెంబర్‌లో అమెరికా సందర్శనకు రూ.19.6 కోట్లు ఖర్చు చేశారు. ఈసందర్శనల ఉద్దేశ్యం క్వాడ్ సదస్సు, ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం. అమెరికా, యుఎఇ, జపాన్‌లలో ఒక్కో దేశాన్ని నాలుగు సార్లు సందర్శించారు. ఫ్రాన్స్‌ను మూడు సార్లు, బ్రిటన్, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల్లో ఒక్కోదేశాన్ని రెండు సార్లు సందర్శించారు. దౌత్య సంబంధాల బలోపేతం కోసం ఈ పర్యటనలు చేసినట్లు ప్రధాని మోడీ పేర్కొన్నప్పటికీ.. దేశంలో ఓ వైపు ఇప్పటికీ ఆహారం, వసతి కోసం ఇబ్బందిపడుతుండటం గమనార్హం. ఈ సందర్శనల కోసం వినియోగించే ప్రభుత్వ వ్యయాన్ని ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికోసం ఖర్చు చేయాలని పలువురు మేధావులు, నిపుణులు పేర్కొంటున్నారు.విదేశీ ప్రయాణాల కోసం అత్యధదిక వ్యయంపై ప్రతిపక్షాలు గతంలో ప్రశ్నలు లేవనెత్తిన సంగతి తెలిసిందే.

# వీధుల నుండి పార్లమెంటు వరకు, పోరాటం కొనసాగుతుంది : ఖర్గే



న్యూఢిల్లీ : వీధుల నుండి పార్లమెంటు వరకు, తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హెచ్చరించారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మె కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 30 కోట్ల మంది సమ్మెలో భాగస్వామ్యమయ్యారు. గురువారం కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. వీధుల నుండి పార్లమెంటు వరకు, తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వ వాణిజ్య ఒప్పందం, కార్మిక చట్టాలు, మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రేడ్ యూనియన్లు, రైతులు, కార్మికులు వీధుల్లో ఆందోళన చేపట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ''లక్షలాది మంది శ్రమిస్తున్న రైతులు, కార్మికులు మరియు కార్మికుల భవిష్యత్తును తాకట్టు పెట్టిన ప్రజా వ్యతిరేక 'ట్రాప్ డీల్'ను మేము గట్టిగా వ్యతిరేకిస్తున్నాము. విదేశీ ఒత్తిడికి లంగి, మోడీ ప్రభుత్వం దేశంలోని కోట్లాది మంది యువత జీవితాలను దెబ్బతీసింది'' అని మండిపడ్డారు. ''అబ్కీ బార్ ట్రంప్ సర్కార్'' అని నినాదాలు చేసిన వారు భారతదేశ జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించారని, దీనికి అతిపెద్ద వ్యతిరేకత మన కార్మికులు, చిన్న వ్యాపారులు మరియు సామాన్య ప్రజల నుండి వస్తుందని ఖర్గే అన్నారు. ''వీధుల నుండి పార్లమెంటు వరకు, మా పోరాటం కొనసాగుతుంది'' ఖర్గే హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతులను ప్రయోజనాలను విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రధాని వారి గురించి ఆలోచిస్తారా లేదా ఇప్పటికీ కార్మికులు, రైతులు తమ చేతుల్లోనే ఉన్నారంటూ కూర్చుంటారో అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## బంగ్లాదేశ్ మాదిరిగానే భారత్‌కి వస్త్రాలపై జీరో టారిఫ్



న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ మాదిరిగానే భారత్‌కి వస్త్రాలపై సున్నా శాతం సుంకాలు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖామంత్రి పీయుష్ గోయల్ వెల్లడించారు. అమెరికా- బంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం వల్ల దాదాపు 20 శాతం టారిఫ్‌లను 19 శాతానికి తగ్గాయి. ప్రత్యేకించి వస్త్ర రంగం అభివృద్ధి, వాణిజ్యం కోసం అమెరికా పత్తితో.. బంగ్లాదేశ్ తయారు చేసిన ప్రత్యేక వస్త్ర ఉత్పత్తులకు అమెరికా సున్నాశాతం సుంకాల్ని విధించింది. ఈ విషయాన్ని ఇరుదేశాలు బహిరంగంగా ప్రకటించాయి. మరోవైపు బంగ్లాదేశ్ కంటే ముందే భారత్‌తో ఒప్పందం చేసుకున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించినా.. భారత్‌కి మాత్రం వస్త్ర ఉత్పత్తులపై 18 శాతం సుంకాల్ని విధించారు. దీనిపై ప్రతిపక్షాలు మోడీ ప్రభుత్వంపై మండిపడ్డాయి. ఈ విషయంపై మీడియా ప్రతినిధులు తాజాగా వాణిజ్యశాఖామంత్రి పీయుష్ గోయల్‌ని ప్రశ్నించారు. దీనికి ఆయన 'బంగ్లాదేశ్ మాదిరిగానే భారత్ కూడా వస్త్ర ఉత్పత్తులపై జీరో టారిఫ్ పొందుతుంది. ప్రస్తుతం ఈ ఒప్పందానికి సంబంధించి ఫ్రేమ్ వర్క్ జరుగుతుంది. ఈ ఒప్పందం ఖరారు అయినప్పుడు దీన్ని ముద్రణ కాపీ ద్వారా మీరు చూడవచ్చు' అని ఆయన అన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఎన్నికల్లో ఘర్షణలు
## జమాత్ నాయకుల చేతిలో బిఎన్‌పి నేత హత్య



ఢాకా : బంగ్లాదేశ్‌లో నేడు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఈరోజు మధ్యాహ్నానికి 32 శాతం పోలింగ్ జరిగినట్లు అక్కడి ఎన్నికల సంఘం తెలిపింది. అయితే అధికారులు ఊహించిన విధంగానే పోలింగ్ సమయంలో అక్కడ ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఖుల్నా 2 నియోజకవర్గంలో జమాత్ నాయకులు, కార్యకర్తలు జరిపిన దాడిలో బిఎన్‌పి నాయకుడు మోహిబజ్జమాన్ కొచ్చి మృతి చెందారు. బంగ్లాదేశ్ ఎన్నికల చరిత్రలో.. పోలింగ్ సమయంలో ప్రాణ నష్టం జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# 'స్టార్ట్'కి చెదలు!



అడిగేవారు లేకపోతే, జవాబుదారీతనం కొరవడితే... ఎక్కడైనా ఇష్టారాజ్యం తప్పదు. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యాలు అలాగే వ్యవహరిస్తున్నాయి. ఎవరేమనుకుంటే ఏమిటన్నట్టు రెచ్చిపోతున్నాయి. అణ్వాయుధాల వల్ల భూగోళానికి పెను ముప్పు ఏర్పడుతుందని ప్రపంచ ప్రజానీకం దశాబ్దాల పాటు ఒత్తిళ్లు తెచ్చిన పర్యవసానంగా ఆ రెండింటి మధ్యా 1991లో మొదటిసారి వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు(స్టార్ట్)--1 ఒప్పందం కుదిరింది. దాని స్థానంలో 2010లో 'న్యూ స్టార్ట్' ఒప్పందం సాకారం కాగా, దానికి ఈనెల 5తో నూకలు చెల్లాయి. ఆ విషయంలో మళ్లీ చర్చలు మొదలెట్టాలని, సాధ్యమైనంత త్వరగా ఒప్పందానికి రావాలని రెండేళ్లుగా పలువురు నిపుణులు, ప్రపంచ శాంతిని కాంక్షించేవారు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. కానీ అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయారు. ఆయన స్థానంలో నిరుడు జనవరిలో వచ్చిన డోనాల్డ్ ట్రంప్‌కు సైతం ఈ సంగతి తెలుసు. దాన్ని గురించి మీడియా ప్రశ్నిస్తే 'ముగిసిపోతుందా...పోనీయండి. దాని స్థానంలో మరొకటి కుదుర్చుకుంటాం' అన్నారే తప్ప ఇంతవరకూ ఆ దిశగా చర్చల కోసం చేసిందేమీ లేదు. కొత్త ఒప్పందానికి సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ అడపా దడపా చెప్పకపోలేదు. కానీ ఉక్రెయిన్‌లో ఆయన సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం ఆ మాటల్లోని చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేసింది. అమెరికా పోకడలూ దానికి భిన్నంగా ఏమీలేవు. 'న్యూ స్టార్ట్' ముగియటంతో ఇరుపక్షాలనూ కట్టిపడేసే అంతర్జాతీయ ఒప్పందమేదీ ఉనికిలో లేకుండా పోయింది. ఇకపై రెండు అగ్రరాజ్యాలూ ఆయుధాలు పోగేసుకున్నా, పరస్పరం కయ్యానికి కాలు దువ్వుకున్నా, అణ్వాయుధాల్ని ప్రయోగించే సాహసం చేసినా... ప్రపంచమంతా నిస్సహాయంగా చూస్తూ ఉండక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు దేశాలకూ, వాటిని సమర్థిస్తున్నవాటికీ జవాబుదారీతనం, భయభక్తులు, వెరపు వంటివి మాయ మయ్యాయి. ఒకప్పుడు ప్రపంచం ఇంతకన్నా కాస్తయినా మెరుగ్గా ఉండేదనటానికి వ్యూహాత్మక ఆయుధాల పరిమితి ఒప్పందం(సాల్ట్) గురించిన చర్చలే ఉదాహరణ. ఆ ఒప్పందం సాకారం కాలేదు. ఒకవేళ అలా అయినా దానివల్ల పెద్దగా ప్రయోజనం ఉండేది కాదు. ఎందుకంటే అప్పటికే ఇరు దేశాలూ పోగేసుకున్న ఆయుధాలు ఇక పెరగకుండా చూడటం తప్ప ఆ చర్చలు సాధించేది పెద్దగా ఏమీ ఉండేదికాదు. కానీ అంతకన్నా మెరుగైన 'స్టార్ట్--1' కుదిరింది. అణ్వాయుధం, లేదా వేరే బాంబును మోసుకెళ్లే సామర్థ్యమున్న క్షిపణులను (వార్‌హెడ్‌లను) 6,000కు తగ్గించటం, వాటి లాంచర్ల (వాహనాల) సంఖ్యను 1,600కు కుదించటం అది సాధించిన ఘనవిజయం. 2010లో కుదిరిన 'న్యూ స్టార్ట్' కూడా చెప్పుకోదగ్గ ముందడుగు. దానివల్ల వార్‌హెడ్‌ల సంఖ్య 1,550కి, లాంచర్ల సంఖ్య 700కు తగ్గాయి. పరస్పరం డేటా మార్పిడి, నోటిఫికేషన్ల విడుదల, క్షిపణుల్ని మోహరించిన ప్రాంతాల తనిఖీలకు అనుమతించటం అందులో ఉన్నాయి. నిజానికి ఈ రెండింటికీ మధ్య 1993లో 'స్టార్ట్--2' గురించి చర్చలు సాగాయి. బహుళ సంఖ్యలో వార్‌హెడ్‌లను ప్రయోగించగల క్షిపణులను నిషేధించాలన్నది ఈ చర్చల ఆంతర్యం. కానీ ఎలాంటి ఫలితమూ లేకుండా ముగిసిపోయాయి. ఇప్పటికే అమెరికా, రష్యాల మధ్య చడీచప్పుడూ లేకుండా ఆయుధ పోటీ సాగుతోంది. తమదగ్గరున్న అణ్వాయుధాలకు కృత్రిమ మేధ(ఏఐ)ను జతచేసి, వాటి శక్తిని అనేక రెట్లు పెంచుకుంటున్నాయి. గంటకు 6,437 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగల రకరకాల క్షిపణులు వచ్చేశాయి. వాటిని విడివిడిగా గురిచూసి కొట్టడం అసాధ్యమని తేలాకే ట్రంప్ 'గోల్డెన్ డోమ్' పేరుతో కొత్త పాట అందుకున్నారు. ఆ 'బంగారు గుమ్మటం' అమెరికాను ఎంతవరకూ రక్షిస్తుందో నిజంగా ఏమైనా జరిగితే తప్ప ఎవరికీ తెలియదు. మొత్తానికి ఇద్దరి వద్దా అటూ ఇటూగా చెరో 5,000 అణ్వాయుధాలున్నాయి. మిగతా దేశాలన్నిటివద్దాఅందులో సగం కూడా ఉండవు. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణమే కొత్త ఒప్పందం కుదుర్చుకోవాలని ప్రపంచ ప్రజానీకం, ముఖ్యంగా ఆ రెండుదేశాల్లోనిప్రజలూతీవ్రంగా ఒత్తిళ్లు తీసుకురావాలి. లేనట్టయితే ప్రపంచం క్షణక్షణ గండంగా బతుకీడ్చక తప్పదు.

# అసమానతలు పెరుగుతున్న ప్రపంచం.. ఇది అభివృద్ధేనా?



'సమాజం ఎంత అభివృద్ధి చెందితే, అసమానత అంత తగ్గాలి' అనేది సాధారణ అంచనా. కానీ 21వ శతాబ్దపు ప్రపంచ వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అపూర్వంగా విస్త రించినప్పటికీ ఆదాయం, సంపద, అవకాశాలు, సాంకేతికత, రాజకీయ ప్రభావం ఇలా అన్ని రంగాల్లోనూ ధనికులు, పేదల మధ్య అంతరం విస్తరిస్తోంది. ఈ అసమానత కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, ఇది సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య స్థిరత్వం, మానవ గౌరవంతో ముడిపడిన మౌలిక సమస్య.. ఈ సమస్యలు తీరాలంటే ప్రపంచానికి మానవ గౌరవాన్ని నిలబెట్టే అభివృద్ధి నమూనా అవసరం.. ప్రపంచ అసమానత తీవ్రతను గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ ప్రకారం, ప్రపంచ జనాభాలోని 10 శాతం మంది, మొత్తం సంపదలో దాదాపు మూడు వంతులు కలిగి ఉన్నారు.. దిగువ 50 శాతం ప్రజల వద్ద స్వల్ప సంపద మాత్రమే ఉంది. ఇది మార్కెట్ శక్తుల సహజ ఫలితంగా కాకుండా, మూలధన ఆధారిత వ్యవస్థలు శ్రమ ఆధారిత ఆదాయాన్ని మించి వేగంగా పెరు గుతున్నదానికి సంకేతం.

### ప్రపంచ స్థాయి అసమానత..

థామస్ పికెట్టి పేర్కొన్నట్లుగా, మూలధన లాభాల వృద్ధి రేటు, ఆర్థిక వృద్ధి కంటే ఎక్కువగా ఉన్నంత కాలం అసమానత పెరుగుతూనే ఉంటుంది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో మూలధనం ప్రధాన శక్తిగా మారింది. భూమి, ఆస్తులు, పెట్టుబడులు కలిగినవారు తమ సంపదను తరతరాలుగా పెంచుకుంటున్నారు. ఇక ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవం వంటివి అధిక నైపుణ్యం ఉన్నవారికి లాభం చేకూర్చగా, తక్కువ నైపుణ్యం ఉన్న కార్మికులను వ్యవస్థ నుంచి బయటకు నెట్టేస్తోంది. అనేక దేశాల్లో పన్ను విధానాలు అసమానతను తగ్గించడంలో విఫలమవుతున్నాయి. వినియోగ పన్నులు పేదల ఆదాయాన్ని కుదించగా, మూలధన లాభాలకు ఇచ్చే రాయితీలు ధనికులను మరింత బలపరుస్తున్నాయి. విద్య, ఆరోగ్యం వంటి మానవ మూలధన రంగాల్లో పెట్టుబడి లోపం సామాజిక అభివృద్ధిని పరిమితం చేస్తోంది.

### పేదరికం చారిత్రక మూలాలు..

పేదరికం చరిత్ర మానవ నాగరికత చరిత్రతో సమానంగా ఉండేంత పురాతనమైంది. వ్యవసాయం ప్రారంభమైన తర్వాత భూమి యాజమాన్యం కొద్దిమందిలోనే కేంద్రీకృతమైంది. సామంత విధానం, బానిస వ్యవస్థలు శ్రమ దోపిడీని వ్యవస్థీకృతం చేశాయి. పరిశ్రమల విప్లవం తరువాత ఉత్పత్తి పెరిగినా, లాభాలు మూలధన యజమానులకే చేరాయి. ఇక వలస పాలన దేశాల్లో స్థానిక ఆర్థిక వ్యవస్థలను నాశనం చేసి దీర్ఘకాలిక పేదరికానికి బీజం వేసింది. ఈ చారిత్రక కారణాలన్నీ కలిసి పేదరికాన్ని ఒక తాత్కాలిక సమస్యగా కాకుండా, వ్యవస్థాత్మక సమస్యగా మార్చాయి. పేదలు పేదరికం నుంచి బయటపడలేకపోవడానికి ప్రధాన కారణం అవకాశాలు లేకపోవడం. పేద కుటుంబాల్లో పుట్టినవారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక భద్రత లభించదు.. ఫలితంగా వారు తక్కువ ఆదాయ ఉపాధుల్లోనే పరిమితమవుతారు.. ఇది తరతరాలుగా కొనసాగుతూ 'పేదరిక చక్రం'గా మారుతుంది. కులం, లింగం, ప్రాంతీయ వివక్షలు ఈ పరిస్థితిని మరింత బలపరుస్తున్నాయి. అనధికార రంగాల్లో పనిచేసే కోట్లాది మంది భీమా, పెన్షన్ వంటి రక్షణ లేకుండా జీవిస్తున్నారు. అప్పుల ఉచ్చు కూడా పేదరికం నుంచి బయటపడే మార్గాన్ని మూసేస్తోంది.

### పరిష్కార మార్గాలు..

భారతదేశం ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. తీవ్రమైన పేదరికం తగ్గిన ప్పటికీ, గ్రామీణ, పట్టణ విభజన, వ్యవసాయంపై అధిక ఆధారపడటం, విద్యా నాణ్యతలో వ్యత్యాసాలు ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాలు, సంక్షేమ పథకాలు, ఆహార భద్రత పథకాల ద్వారా పేద రికాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలోని కొన్ని దేశాలు అసమానతను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. నార్డిక్ దేశాలు అధిక పన్నులు వసూలు చేసి, ఉచిత విద్య, ఆరోగ్య సేవలు అందిస్తూ సమాన అవకాశాలను కల్పి స్తున్నాయి. బ్రెజిల్ వంటి దేశాలు పేద కుటుంబాలకు షరతు లతో నగదు సహాయం అందిస్తూ మానవ మూలధనాన్ని బలపరిచాయి. ఈ అనుభవాలు నేర్పేది ఏమిటంటే, మార్కెట్ వృద్ధితో పాటు బలమైన ప్రభుత్వ జోక్యం అవసరం. ప్రగతిశీల పన్నులు, సామాజిక భద్రత, మానవ మూలధనంలో పెట్టుబడి ఇవన్నీ కలిసి పనిచేయాలి.

### ఇది నిజమైన అభివృద్ధి కాదు..

ప్రపంచంలో పేదరికం తగ్గాలంటే మానవ గౌరవాన్ని నిలబెట్టే అభివృద్ధి నమూనా అవసరం. పెరుగుతున్న అసమానత ఆధునిక ప్రపంచానికి అతిపెద్ద ముప్పుల్లో ఒకటి.. ఇది కేవలం ఆర్థిక గణాంకాల సమస్య కాదు.. ఇది సామాజిక స్థిరత్వం, ప్రజాస్వామ్య విశ్వసనీయత, మానవ గౌరవానికి సంబంధించిన సమస్య. సరైన పన్ను విధానం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, విస్తృత ఉపాధి అవకాశాలు, సమర్థవంతమైన సంక్షేమ వ్యవస్థలు అమలైతే అసమానతను తగ్గించవచ్చు. అభివృద్ధి కొద్దిమందికి మాత్రమే పరిమితమైతే అది నిజమైన అభివృద్ధి కాదు. సమానత్వం, న్యాయం, అవకాశాల సమాన పంపిణీతో కూడిన వృద్ధే సుస్థిరమైన అభివృద్ధి. అదే 21వ శతాబ్దపు నిజమైన విజయం.

# యూజీసీ కొత్త నిబంధనలు.. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనా?




యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన కొత్త 'వివక్ష వ్యతిరేక' (యాంటీ డిస్క్రిమినేషన్) నిబంధనల చుట్టూ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ చర్చ ఒక చట్టం మంచిదా చెడ్డదా? అనే పరిమితిలో లేదు.. ఇది సామాజిక న్యాయం, సమానత్వం, రాజకీయ ఉద్దేశాలు, భయాలు, అనుమానాలు అన్నీ కలగలిసిన ఒక పెద్ద వాదనగా మారింది. ఈక్వల్ ఆపర్చునిటీ సెంటర్లు, 24 గంటల్లో విచారణ వంటి నిబంధనలు ఇందులో ఉన్నాయి.. ఈక్వల్ ఆపర్చునిటీ కమిటీల ఏర్పాటు ద్వారా జనరల్ కేటగిరీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, ఇది 'యాంటీ-మెరిట్' చట్టమని వాదనలు ఉన్నాయి. ఒకవైపు, అణగారిన వర్గాల విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో ఎదుర్కొంటున్న కుల వివక్షను ఎవరూ ఖండించలేరు.. దళిత, ఆదివాసీ, ఓబీసీ విద్యార్థులు ప్రవేశాల నుంచి పరీక్షల జరిగి మూల్యాంకనం వరకు, హాస్టల్ జీవితం నుంచి పరిశోధన మార్గదర్శకత్వం వరకు వివక్షను ఎదుర్కొంటున్నారనే ఆరోపణలు ఎన్నో ఏళ్లుగా వినిపిస్తున్నాయి. 'రోహిత్ వేముల, పాయల్ తాడ్వీ' వంటి విషాద ఘటనలు ఈ సమస్యను దేశం ముందు ఉంచాయి.

### వివక్షపై పోరులో ఇంత నిబద్ధతా?

ఈ నేపథ్యంలోనే యూజీసీ యాంటీ డిస్క్రిమినేషన్ వ్యవస్థను బలపరచాలనే ఉద్దేశంతో కొత్త నిబంధనలు తీసుకువచ్చిందని ప్రభుత్వం చెబుతోంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హక్కులను అమలు చేయడానికే ఇవి అవసరమని మద్దతుదారుల వాదన.. రాజకీయ కోణం కూడా ఈ వివాదంలో కీలకం అయింది. రోహిత్ వేముల చట్టం గురించి రాహుల్ గాంధీ మాట్లాడిన వెంటనే, దానికి కౌంటర్‌గా ఈ నిబంధనలు వచ్చాయా? అనే అనుమానాలు ఉన్నాయి. ఇది నిజంగా అణగారిన వర్గాల రక్షణ కోసమా, లేక రాజకీయ 'డైవర్షన్' లో భాగమా ! అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. అయితే, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వ హక్కులను వాస్తవంగా అమలు చేయడానికే ఇవి అవసరమని మద్దతుదారులు వాదిస్తున్నారు.

### జనరల్ కేటగిరీ వర్గాల భీతి..

మరోవైపు, ఈ నిబంధనలపై కొంతమంది విద్యార్థులు, అధ్యాపకులు, ముఖ్యంగా జనరల్ కేటగిరీకి చెందిన వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. "వివక్ష" అనే నిర్వచనం చాలా విస్తృతంగా ఉంటే, చిన్న విషయాలకే కేసులు పెట్టే పరిస్థితి వస్తుందా! అనే భయం వారిలో ఉంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం విషయంలో తప్పుడు కేసుల దుర్వినియోగంపై చర్చ జరిగిన నేపథ్యం గుర్తుకు తెస్తున్నారు. అదే విధంగా యూజీసీ నిబంధనలు కూడా అమల్లోకి వస్తే, నిరూపణ లేకుండానే చర్యలు, అరెస్టులు జరిగితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందనే ప్రశ్నలు వేస్తున్నారు.. ఇది విద్యా వాతావరణాన్ని భయభ్రాంతులకు గురిచేస్తుందా? అనే అనుమానం కూడా ఉంది.

### నిరసన హక్కుపై రివర్స్ గళం..

ఇక్కడ ఇంకొక విరుద్ధత స్పష్టంగా కనిపిస్తుంది. యూజీసీ బిల్లు తీసుకొచ్చినప్పుడు నిరసన తెలిపిన వారిని దేశద్రోహులుగా విమర్శించిన రాజకీయ శక్తులే, ఇప్పుడు ఈ నిబంధనల విషయంలో తమకు నిరసన హక్కు లేదా? అని ప్రశ్నించడంపై విమర్శలు వస్తున్నాయి.. అదే సమయంలో, ప్రభుత్వం స్వయంగా నిబంధనలు రూపొందించి, వాటిపైనే తన మద్దతుదారుల నుంచి నిర సనలు రావడం కూడా గందరగోళాన్ని పెంచుతోంది. 'వాళ్లే చట్టం పెట్టి, వాళ్లే వ్యతిరేకిస్తున్నారా?' అనే ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతోంది.

### కాగితాలకే నిబంధనలు పరిమితమైతే...!

రాజకీయ కోణం కూడా ఈ వివాదంలో కీలకం అయింది. రాహుల్ గాంధీ రోహిత్ వేముల చట్టం గురించి మాట్లాడిన వెంటనే, దానికి కౌంటర్‌గా ఈ నిబంధనలు వచ్చాయా? అనే అనుమానాలు ఉన్నాయి. ఇది నిజంగా అణగారిన వర్గాల రక్షణ కోసమా, లేక రాజకీయ 'డైవర్షన్' లో భాగమా! అనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఎన్నికల కాలంలో ఇలాంటి అంశాలు తరచూ భావజాల పోరాటాలకు వేదిక అవుతాయన్నది కొత్త విషయం కాదు.. నిజానికి, ఈ సమస్యకు చట్టం ఉందా? లేదా అన్నదానికంటే, అది ఎలా అమలవుతుంది? అన్నదే పెద్ద ప్రశ్న. పాత యూజీసీ నిబంధనలు కూడా కాగితాలకే పరిమితమయ్యాయన్న విమర్శ కూడా ఉంది. ఈ కొత్త నిబంధనలకు కూడా అదే గతి పడితే, వివాదం వృథానే. అదే సమ యంలో, అమలులో అతిగా కఠినత్వం చూపితే, అది మరో రకమైన అన్యాయానికి దారి తీసే ప్రమాదం కూడా ఉంది.

### విద్యావ్యవస్థపై నమ్మకం ప్రధానం..

ఈ నిబంధనలు సమాజాన్ని చీల్చేలా ఉన్నాయని, ర్యాగింగ్ వంటి కీలక అంశాలను చేర్చలేదని, స్పష్టత కొరవడిందని సుప్రీంకోర్టు స్టే విధించింది. 'వివక్ష'కు సంబంధించి నిబంధనలలోని స్పష్టత, కుల ఆధారిత వివక్షను విడిగా నిర్వచించడంపై కోర్టు ప్రశ్నలు లేవనె త్తింది. దీంతో వివాదాస్పద నిబంధనలను సమీక్షించడానికి మోడీ ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రగడకు పరిష్కారం చట్టాన్ని పూర్తిగా తిరస్కరించడంలోనో, సమర్థించడంలోనో లేదు. అణగారిన వర్గాలకు నిజమైన రక్షణ కల్పిస్తూ, నిర్దోషులపై అన్యాయం జరగకుండా సమతుల్యమైన అమలు విధానం అవసరం. స్పష్టమైన నిర్వచనాలు, స్వతంత్ర విచారణ కమిటీలు, అప్పీల్‌కు అవకాశం ఉంటేనే న్యాయం సాధ్యమ వుతుంది. భావోద్వేగాలు, రాజకీయ లాభనష్టాల కన్నా విద్యా వ్యవస్థలో న్యాయం, విశ్వాసం నిలబెట్టడమే అసలైన లక్ష్యం కావాలి. అప్పుడే ఈ నిబంధనలు వివాదానికి కాదు, పరిష్కారానికి దారి తీస్తాయి..


# ట్యాబ్లెట్లను వాడుతున్నా కూడా.. థైరాయిడ్ అదుపులోకి రావడం లేదంటే కారణాలు ఇవే..!



ప్రస్తుతకాలంలో మనలో చాలా మందిని వేధిస్తున్న అనారోగ్య సమస్యల్లో థైరాయిడ్ ఒకటి. ప్రతి పది మందిలో ఒకరు హైపోథైరాయిడిజంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సమస్యతో ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. థైరాయిడ్ సమస్యను నియంత్రణలో ఉంచుకోవడానికి రోజూ కొన్ని లక్షల మంది థైరాయిడ్ ట్యాబ్లెట్లను వేసుకుంటున్నారని చెప్పవచ్చు. అయితే మనలో చాలా మంది థైరాయిడ్ ట్యాబ్లెట్లను వేసుకుంటున్నప్పటికీ దాని ఫలితాలు సరిగ్గా లేవని, ట్యాబ్లెట్లను వేసుకున్నప్పటికీ బరువు పెరగడం, అలసట, శక్తి లేకపోవడం, జుట్టు రాలడం, పొడి చర్మం వంటి సమస్యలతో బాధపడుతూనే ఉన్నామని చెబుతుంటారు. ట్యాబ్లెట్లను వేసుకున్నప్పటికీ సమస్యలతో ఎందుకు బాధపడుతున్నారు.. అలాగే థైరాయిడ్ గ్రంథి పనితీరు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**కీలక విధుల నిర్వహణ..**

మన శరీరంలో ముఖ్యమైన గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. గొంతు కింద భాగంలో సీతాకోకచిలుక ఆకారంలో ఈ గ్రంథి ఉంటుంది. శరీరంలో శక్తి ఉత్పత్తి, వినియోగం, నిల్వలను నియంత్రించే కీలక విధులను ఈ గ్రంథి నిర్వర్తిస్తుంది. మెదడులోని పిట్యూటరీ గ్రంథి థైరాయిడ్ గ్రంథి కార్యకలపాలను నియంత్రిస్తుంది. థైరాయిడ్ గ్రంథి థైరాక్సిన్ టి-4 ( రక్తంలో ఎక్కువగా ఉండే హార్మోన్) , ట్రైయోడోథైరొనిన్ టి-3 ( కణ స్థాయిలో పనిచేసే క్రియాశీల హార్మోన్)ను ఉత్పత్తి చేస్తుంది. ఈ హార్మోన్ల స్థాయిలను బట్టే థైరాయిడ్ నిర్ధారణ, చికిత్స జరుగుతుంది. థైరాయిడ్ హార్మోన్లు తగినంత ఉత్పత్తి కాకపోవడం వల్ల హైపోథైరాయిడిజం సమస్య వస్తుంది. అలసట, బరువు పెరగడం, చలిని తట్టుకోలేకోవడం దీని లక్షణాలు. అయోడిన్ లోపం, థైరాయిడ్ గ్రంథి తొలగింపు, పిట్యూటరీ గ్రంథి లోపాలు, హాషిమోటో అనే వ్యాధి కారణంగా ఈ సమస్య తలెత్తుతుంది.





**మైటోకాండ్రియా పనితీరు కీలకం..**

ఇక థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అవ్వడం వల్ల హైపర్ థైరాయిడిజం వస్తుంది. గ్రేవ్స్ వ్యాధి కారణంగా ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఆందోళన, వేడిని తట్టుకోలేకపోవడం, బరువు తగ్గడం, గుండెదడ వంటి లక్షణాలు ఈ సమస్యలో కనిపిస్తాయి. సరైన మందులు ఉన్నప్పటికీ చాలా మందిలో అలసట, బరువు నియంత్రణలో లేకపోవడం, మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. థైరాయిడ్ హార్మోన్ల తయారీ మైటోకాండ్రియా ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. మైటోకాండ్రియా అనేవి కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే నిర్మాణాలు. ఇవి పోషకాలను శక్తిగా మార్చి శరీరంలో అన్ని అవయవాలకు శక్తిని అందిస్తాయి. మైటోకాండ్రియా ఆరోగ్యం బాగుంటేనే థైరాయిడ్ హార్మోన్లు సరిగా తయారవుతాయి. మైటోకాండ్రియా శక్తి ఉత్పత్తి తగ్గితే హార్మోన్లు ఉన్నా వాటి ప్రభావం తగ్గుతుంది.

**ఇలా చేయాలి..**

థైరాయిడ్ హార్మోన్లు సరిగ్గా ఉన్నా కణాల శక్తి బలహీనంగా ఉంటే జీవక్రియ సరిగ్గా జరగదు. కనుక మందులు వాడినప్పటికీ సమస్యలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ సమస్యను హార్మోన్ల సమస్యగా కాకుండా కణశక్తి సమస్యగా చూడాలని వారు చెబుతునన్నారు. కణశక్తి స్థాయినిపెంచడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఐరన్, విటమిన్ బి, మెగ్నీషియం లోపాలు లేకుండా చూసుకోవాలి. నిద్రలేమి, ఒత్తిడి వంటి సమస్యలు రాకుండా చూసుకోవాలి. కండర వ్యాయామాలు చేయాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. ట్యాబ్లెట్లను తీసుకోవడంతో పాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం వల్ల థైరాయిడ్ వల్ల వచ్చే ఇతర అనారోగ్య సమస్యలు కూడా తగ్గుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు.

# మీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ ఈ ఆహారాలను తీసుకోవాల్సిందే..!



మన శరీరం సక్రమంగా పనిచేయడానికి సహాయపడే అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు కూడా ఒకటి. ఇవి మన శరీరంలో అతి ముఖ్యమైన విధులను నిర్వర్తిస్తాయి. వ్యర్థాలను బయటకు పంపించడం, రక్తపోటును అదుపులో ఉంచడం, శరీరంలో ద్రవాలను సమతుల్యంగా ఉంచడం, శరీర జీవక్రియలకు మద్దతు ఇవ్వడం వంటి అనేక విధులను మూత్రపిండాలు నిర్వర్తిస్తాయి. అయితే ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. జంక్ ఫుడ్ ను, ప్రాసెస్ చేసిన ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలపై ఒత్తిడి ఎక్కువగా పడుతోంది. దీంతో మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటోంది. వాటి పనితీరు కూడా తగ్గుతోంది. మూత్రపిండాల ఆరోగ్యంపై మొత్తం శరీరం ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కనుక మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆహారాలను తీసుకోవడం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ముఖ్యమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**కీరదోస, నిమ్మకాయలు..**

మనకు చాలా తక్కువ ధరలో ఏడాది పొడవునా లభించే కూరగాయల్లో కీరదోసకాయ ఒకటి. వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉంటుంది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇవి మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఎంతగానో సహాయపడతాయి. కీరదోసకాయలను తీసుకోవడం వల్ల శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. కీరదోసకాయలలో పొటాషియం తక్కువగా ఉంటుంది కనుక మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడే వారు కూడా వీటిని తీసుకోవచ్చు. నిమ్మకాయలు కూడా మూత్రపిండాల ఆరోగ్యానికి మద్దతును ఇస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల మూత్రపిండాల్లో రాళ్ల సమస్య నుండి కూడా బయటపడవచ్చు. నిమ్మకాయల్లో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా చేయడంలో దోహదపడుతుంది. రోజూ గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తీసుకోవడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యంతోపాటు వాటి పనితీరు కూడా మెరుగుపడుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మూత్రపిండాల కణాలు దెబ్బతినకుండా రక్షిస్తాయి.

**కొత్తిమీర..**

అలాగే కొత్తిమీరను తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది మూత్రం ఉత్పత్తిని పెంచుతుంది. శరీరంలో ఉండే అదనపు ద్రవాలు, వ్యర్థాలు, విషాలు మూత్రం ద్వారా బయటకు పంపించడంలో కొత్తిమీర ఎంతో సహాయపడుతుంది. దీంతో మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా ఉంటాయి. కొత్తిమీరలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వాపులను తగ్గించడంతో పాటు కణజాల నష్టం జరగకుండా కాపాడడంలో కూడా సహాయపడతాయి. దీనిలో నైట్రేట్స్



కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో ఉపయోగపడతాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అలాగే మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడే వారు ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ ఆహారాలను తీసుకుంటూనే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం, రక్తపోటును అదుపులో ఉంచుకోవడం, నీటిని తాగడం, ధూమపానాన్ని మానేయడం వంటివి చేయడం వల్ల మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు కూడా రాకుండా ఉంటాయని వైద్యులు సలహా ఇస్తున్నారు.

# కలుపు మందు వాడేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు



తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట్ గ్రామంలో వరి పంట పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో కలుపు మందులు వినియోగించే సమయంలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పొలంలో నీటి మట్టం 23 సెంటీమీటర్లు మించకూడదు. కలుపు మందు వాడిన తర్వాత 48 నుండి 72 గంటల వరకు పొలంలోని నీటిని తీసివేయకూడదని చెప్పారు. అలాగే కలుపు ఎక్కువగా ఉందని కారణంగా మోతాదును పెంచరాదు అని సూచించారు. నాట్లు వేసిన 35 రోజుల దశలో, పలుచగా నీరు పెట్టి ఎకరాకు 500 మి.లీ. ప్రెటిలాక్లోర్ లేదా 1 లీ. బ్యూటాక్లోర్ ను 20 కిలోల ఇసుకతో కలిపి పొలంలో సమానంగా చల్లాలి. గుళిక రూపంలో ఉపయోగించాలనుకుంటే ఎకరాకి 4 కిలోల బెన్సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రెటిలాక్లోర్ లేదా పైరజోసల్ఫ్యూరాన్ + ప్రెటిలాక్లోర్ గుళికలను ఉపయోగించాలి. నాట్లు వేసిన 2025 రోజుల దశలో, కలుపు 35 ఆకుల దశలో ఉన్నప్పుడు మందులు సమర్థవంతంగా పనిచేస్తాయి. పొలంలో ఏ రకమైన కలుపు ఉందో గుర్తించి దానికి అనుగుణంగా మందులు వాడాలి.

గడ్డిజాతి కలుపు నివారణకు

ఎకరాకు 300 మి.లీ. సైహలోఫాప్ బ్యుటైల్ లేదా 350 మి.లీ. ఫెనాక్సీప్రాప్ ఇథైల్

వెడల్పాకు కలుపు నివారణకు

ఎకరాకు 1 లీ. 2,4డి ఇథైల్ ఎస్టర్ లేదా 500600 గ్రా. 2,4డి సోడియం సాల్ట్ మిశ్రమం ఉపయోగించాలి.

కలుపు నివారణకు

ఎకరాకు 60 గ్రా. పైరజోసల్ఫ్యూరాన్ + బిస్పరిబాక్ సోడియం లేదా 800 మి.లీ. సైహలోఫాప్ + పెనాక్సులామ్ లేదా 90 గ్రా. ట్రయోఫమాన్ + ఇథాక్సీ సల్ఫ్యూరాన్ వాడాలి.


రైతులు గమనించాల్సిన ముఖ్య విషయం :

ఏ కలుపు మందు కూడా 100% కలుపును పూర్తిగా నివారించదు. మందు వేసిన తర్వాత మిగిలిన కలుపును చేతితో తొలగించాలి. లేకపోతే ఆ కలుపు విత్తనాలు భవిష్యత్తులో మందులకు ప్రతిరోధం పెంచుతాయి, తద్వారా కలుపు నివారణ కష్టమవుతుందని తెలిపారు

# ప్రొటీన్ ఆహారం నుంచే




ప్రొటీన్ విషయంలో శాకాహారులు దిగులు పడుతుంటారు. తగినంత అందటం లేదేమో, ప్రొటీన్ పొడుల వంటివి తీసుకోవాలేమో అని అనుకుంటుంటారు. నిజానికి ఆహారం ద్వారా లభించేలా చూసుకోవటమే ఉత్తమం. మనకు ఒక కిలో శరీర బరువుకు రోజుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. అదే 50 ఏళ్లు దాటితే 1.2 గ్రాములు కావాలి. మాంసం, గుడ్డు వంటి జంతు ప్రొటీన్లలో మొత్తం 9 అమైనో ఆమ్లాలుంటాయి. వీటిని శరీరం బాగా గ్రహిస్తుంది కూడా. సోయాబీన్స్ మినహా చాలా శాకాహార పదార్థాల్లో ఒకటి, అంతకన్నా ఎక్కువ అమైనో ఆమ్లాలు తక్కువగా ఉంటాయి. అలాగని నిరాశ పడాల్సిన పనిలేదు. రకరకాల పదార్థాలను కలిపి తీసుకుంటే ఒకదాంతో మరోటి భర్తీ అవుతాయి. ఉదాహరణకు- బియ్యం, గోధుమల వంటి తృణ ధాన్యాల్లో లైసిన్ ఉండదు. పప్పుదినుసుల్లో మిథియోనిన్ ఉండదు. కాబట్టి మూడొంతులు బియ్యం, గోధుమల వంటి తృణధాన్యాలు.. ఒక వంతు పప్పులు కలిపి తీసుకోవటం మంచిది. దీంతో బియ్యంలో లేని లైసిన్ పప్పులతో లభిస్తుంది. పప్పుల్లో లేని మిథియోనిన్ బియ్యం, గోధుమల నుంచి అందు తుంది. అప్పుడు అన్ని అత్యవసర అమైనో ఆమ్లాలు లభించినట్ట వుతుంది. వీటిని శరీరం పూర్తిగా వాడుకుం టుంది. తగినంత ప్రొటీన్ అందుతుంది. మితిమీరి ప్రొటీన్ పొడులు వాడితే దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు దారితీయొచ్చు. మోతాదు మరీ ఎక్కువైతే కిడ్నీల మీద ఎక్కువ భారం పడుతుంది. ప్రొటీన్ జీర్ణమయ్యాక మిగిలిపోయే నత్రజనిని శరీరంలోంచి బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ పనిచేయాల్సి ఉంటుంది. కిడ్నీలు సరిగా పనిచేయని వారికిది చిక్కులు కలిగిస్తుంది.




# విరబూసే బెలూన్ పూల మొక్క




ఆహ్లాదకరమైన రంగులూ, చిత్రమైన ఆకారంలో అందంగా విచ్చుకుంటుందీ బెలూన్ ఫ్లవర్. మరి ఈ మొక్కని ఎలా పెంచుకోవాలో తెలుసా?


బెలూన్ పూల మొక్క.. శాస్త్రీయ నామం ప్లాటికోడాన్ గ్రాండీఫ్లోరస్. ఇది కాంపానులేసియా కుటుంబానికి చెందినది. తక్కువ నిర్వహణతో పెంచుకోగలిగే బహువార్షిక మొక్క ఇది. దీనికి బుడగల్లాంటి మొగ్గలు, నక్షత్ర ఆకారంలో పూలు పూస్తాయి. ఇవి నీలం, గులాబీ, తెలుపు రంగుల్లో వికసిస్తాయి. మొగ్గలు వచ్చే తీరుని బట్టే దీనికి బెలూన్ పూల మొక్కగా పేరొచ్చింది. తూర్పు ఆసియాలోని పలు దేశాల్లో విరివిగా కనిపిస్తుందీ మొక్క. ఆర్నమెంటల్ ప్లాంట్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. కొరియాలో దీని వేరుని సలాడ్‌లు, టీలు, ఔషధాల్లో ఉపయోగిస్తారు.




**సంరక్షణ సులువే...**

బెలూన్ ఫ్లవర్ మొక్కని పెంచడం సులువే. ఒక్కసారి నాటుకుంటే చాలా ఏళ్లపాటు నిలదొక్కుకుంటుంది. పూర్తి ఎండలో... అంటే కనీసం ఆరేడు గంటలైనా దీనికి ప్రత్యక్ష సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. నేలలోనే కాదు... కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు. అయితే, తరచూ మార్చడం, మొదలు చుట్టూ తవ్వడం వంటివి చేస్తే బతకదు. అందుకే, దీన్ని నాటేందుకు పెద్ద కుండీని ఎంచుకోవాలి. నీరు నిలవని సారవంతమైన మట్టిలో నాటుకోవాలి. బెలూన్ ఫ్లవర్ ప్లాంట్‌కి నీళ్లు క్రమం తప్పకుండా పోయాలి. కానీ, అవి ఎక్కువగా నిలవకుండా చూసుకోవాలి. లేదంటే ఫంగల్ వ్యాధులు సోకి మొక్క ఎదుగుదల దెబ్బతింటుంది. ఇక, దీనికి పూలు ఎక్కువగా పూయాలంటే... నెమ్మదిగా విడుదల అయ్యే బ్యాలెన్స్‌డ్ ఫెర్టిలైజర్‌ని అందించాలి. ముఖ్యంగా నీళ్లలో కరిగే ఎన్‌పీకే సమగ్ర ఎరువును 10:10:10 నిష్పత్తిలో ఇవ్వాలి. ఈ పూల మొక్కకు పేను బంక, సాలీడు, బూడిద తెగుళ్లు వస్తుంటాయి. అందుకే, ఎక్కువ తడి లేకుండా చూసుకోవడం, వేపనూనెను స్ప్రే చేయడం వంటి పనుల వల్ల అవి నియంత్రణలో ఉంటాయి. ఈ బెలూన్ పూల మొక్కని పెంచాలంటే.. విత్తనాలు లేదా నారు నాటుకోవచ్చు. దీని చిగుళ్లు గిల్లితే గుబురుగా పెరుగుతుంది. పూలు వాడిపోయాక తీసేయాలి. అప్పుడే నిండుగా పూస్తాయి. ఈ మొక్క తేనెటీగలు, సీతాకోకచిలుకలను ఎక్కువగా ఆకర్షించి... పెంచుకునే ప్రదేశానికి కొత్తందాన్ని తెచ్చిపెడుతుంది.









# ప్రతి స్కూల్ లో ఉండాలి టీచర్ల బుక్‌క్లబ్స్




టీచర్లు టెక్స్ట్‌బుక్స్ చదువుతారు. సిలబస్ మారితే కొత్త పాఠ్యపుస్తకాలు చదువుతారు. సబ్జెక్ట్ మీద ఆసక్తి ఉన్నవారు ఆ సబ్జెక్ట్‌కు సంబంధించిన పుస్తకాలు చదువుతుంటారు. కాని పుస్తకాలు చదువుతున్నారా?

పుస్తకాలంటే...

సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు, జీవిత చరిత్రలు, సినిమా, సంగీతం, సైకాలజీ, యాత్రాకథనాలు... ఈ పుస్తకాలు చదువుతున్నారా? హెచ్‌ఆర్‌ఏ అందుకునే టీచర్లు తమ నివాసంలో కనీసం ఒక బుక్‌షెల్ఫ్ అయినా మెయిన్‌టెయిన్ చేస్తున్నారా? ఎందుకంటే పుస్తక పఠనం ఉపాధ్యాయులకు చాలా మేలు చేస్తుందని విద్యావేత్తలు అంటున్నారు. బెంగళూరు నగరంలో టీచర్ల బుక్‌క్లబ్స్ ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి.

**విధాలా మేలు..**

పుస్తకాలు చదవడం వ్యక్తిగతంగా, వృత్తిగతంగా మేలు కలిగిస్తున్నాయి. బెంగళూరులోని క్రేయన్ ప్రీస్కూల్ అకాడమిక్ కోఆర్డినేటర్ మధు ప్రకాశ్ కొన్నిరోజుల నుంచి ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. ఏ అనారోగ్య సమస్యా లేదు. అయినా జీవితంలో ఏదో వెలితి. ఆ వెలితిని పుస్తక పఠనం ద్వారా అధిగమించారు. రోజూ కనీసం అరగంట సేపు పుస్తకాలు చదవడం ద్వారా ఒత్తిడి దూరమవడంతోపాటు మనసుకు ప్రశాంతంగా అనిపిస్తోందని, దానివల్ల ఉద్యోగం మీద ఏకాగ్రత పెరిగిందని వివరిస్తున్నారామె. ఆమె అనుభవం తెలుసుకున్న మరికొందరు టీచర్లు పుస్తకాలు అందుకున్నారు. విద్యావేత్త నీలమ్ దీక్షిత్ పరిశీలనలో రోజుకో అరగంటపాటు పుస్తకాలు, దినపత్రికలు చదివే టీచర్లు ఉద్యోగంలో మెరుగైన ఫలితాలు నమోదు చేస్తున్నారని వివరిస్తున్నారు.

ఈ క్రమంలో కొన్ని పాఠశాల యాజమాన్యాలు బుక్ క్లబ్‌లు ఏర్పాటు చేసి టీచర్లను అందులో భాగస్వాములను చేస్తున్నారు. వారానికో పుస్తకం చొప్పున చదివేలా ప్రోత్సహిస్తున్నారు. తమతోపాటు టీచర్లు కూడా కూర్చొని పుస్తకాలు చదువుతుండటంతో పిల్లలకు అది ఉత్సాహం కలిగిస్తోందని పాఠశాల యాజమాన్యాలు అంటున్నాయి.

అభిప్రాయాలను మారుస్తూ.. 'అకాడమిక్ పుస్తకాలతో కుస్తీ పట్టడానికే సమయం చాలడం లేదు. ఇక బయట దొరికే పుస్తకాలు చదివే వీలెక్కడిది?' అని కొందరు ఉపాధ్యాయులు పెదవి విరిస్తే ఈ అభిప్రాయాన్ని మార్చేందుకు మధు ప్రకాశ్ ఓ పని చేశారు. జొనాథన్ హైడ్ రాసిన 'ది ఆంక్షియస్ జనరేషన్' అనే పుస్తకం గురించి ఓ ప్రజెంటేషన్ ఇచ్చారు. అది ఇతర టీచర్లకు ఆసక్తి కలిగించడంతో వారు ఆ పుస్తకం చదివేందుకు ముందుకొచ్చారు. స్టాన్లీ గ్రీన్ స్పాన్ రాసిన 'ప్లేగ్రౌండ్ పాలిటిక్స్' పుస్తకం చదవడం ద్వారా తాను బోధించే విధానం మారిందని వాణి అనే ఉపాధ్యాయిని చెప్పడంతో ఇతర టీచర్లకూ ఆ పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగింది. వర్జీనియా ఆక్స్‌లైన్ రాసిన 'డిబ్స్ ఇన్ సెర్చ్ ఆఫ్ సెల్ఫ్', ఇ.ఆర్.బ్రెత్‌వెయిట్ రాసిన 'టు సర్, విత్ లవ్' పుస్తకాలు చదవడం వల్ల పిల్లలతో తాను ప్రవర్తించే విధానంగా సమూలంగా మారిందని ప్రతిమా అనే ఉపాధ్యాయిని వివరిస్తున్నారు. టీచర్ బుక్‌క్లబ్‌లో ఎలాంటి పుస్తకాలు చదవాలనేదానిపైనా కొందరు టీచర్లు సూచనలు చేస్తున్నారు. హెలెన్ కెల్లర్, ఐన్ స్టీన్, మేరీ క్యూరీ, అన్నా ఫ్రాంక్, మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ వంటి మహనీయుల జీవితచరిత్రలతోపాటు సైన్స్, చరిత్ర, సాంస్కృతిక అంశాలపై పుస్తకాలకుప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు. పాఠాల్లో ఉన్న అంశాలపై మరింత లోతైన సమాచారం అందించే పుస్తకాలనూ టీచర్లు చదువుతూ విద్యార్థుల చేత చదివిస్తున్నారు. బెంగళూరులో కొన్ని స్కూళ్లలో పాటిస్తున్న ఈ విధానం చూసి ఇతర స్కూళ్లలోనూ టీచర్స్ బుక్‌క్లబ్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. టెట్సుకో కురొయానాగి రాసిన 'టొటొ చాన్ ' చదివితే పిల్లల సామర్థ్యాలేమిటో అర్థమయ్యాయి అంది ఒక ఉపాధ్యాయిని. స్టాన్లీ గ్రీన్స్పాన్ రాసిన 'ప్లే గ్రౌండ్ పాలిటిక్స్' చదివితే పిల్లల మధ్య అనుబంధాలు తెలిసొచ్చాయి అంది మరో ఉపాధ్యాయిని. ప్రభుత్వాలు పిల్లల చేత న్యూస్‌పేపర్లు చదివించే నిబంధనలను తెస్తున్నాయి. కాని టీచర్లు పాఠకులుగా ఉంటున్నారా? టీచర్లు పుస్తకాలు చదివితే వృత్తి నైపుణ్యంతోపాటు పిల్లల వికాసం మరింత బాగుంటుందని బెంగళూరు టీచర్లు నిర్వహిస్తున్న

వాట్సప్ టీచర్స్ బుక్ క్లబ్స్ నిరూపిస్తున్నాయి. టీచర్లూ... ఏం చదువుతున్నారు?

నినాదం
నిఖార్సైన జర్నలిజం






# దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు

**ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచిత పథకాల గురించిడిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది.**

ఎడిటోరియల్

తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్దిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటి వలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్దతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్దిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు.

ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిం దని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లకీఁeమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయానుకూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయితే ఉచిత మంత్రం అన్నిసార్లూ అందరికీ ఉపయోగపడదన్నది నిన్న మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో కేజీవాల్, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జగన్ వంటి వారి ఓటమిని ఆపలేకపోయాయి. అందుకే అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. ఎన్నికల సంఘం కూడా ఈ పథకాల ప్రకటనలను నిషేధించాలి. ఒకసారి ఉచిత పథకాలు ప్రవేశ పెట్టాక వాటిని సమీక్షించుకునేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కిలో రూపాయి బియ్యం ఇందుకు ఉదాహరణ.

# రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## లోక్ సభలో బీజేపీ ఎంపి నిషికాంత్ దూబె తీర్మానం

రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధం విధించాలని దూబే కోరారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రాహుల్ సోరస్ సంస్థతో చేతులు కలిపి దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ ఈరోజు లోకసేభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. నేను ప్రతిపాదించిన తీర్మానంలో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితకాలం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అభ్యర్థించాను' అని అన్నారు. కాగా, నిన్న రాహుల్‌గాంధీ లోకసేభలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోడీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని, భరతమాతను అమ్మేశారని వ్యాఖ్యానించారు. మరుసటి రోజే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే



గురువారం లోకసేభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోకసేభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోకసేభలో తీవ్ర ఆరోపణలు చేశార. ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు.

# భారత ఆరోగ్య వ్యవస్థలో ప్రమాద ఘంటికలు

## వైద్యం పేరిట సాగుతున్న అమానవీయ దోపిడీ.!

**భారతదేశంలో వైద్యం అనేది ఒకప్పుడు పవిత్రమైన సేవగా పరిగణించబడేది, కానీ నేడు అది లాభాలే పరమావధిగా సాగే ఒక క్రూరమైన వ్యాపార సామ్రాజ్యంగా రూపాంతరం చెందింది. ఈ విషయాన్ని సామాన్యులే కాదు, స్వయంగా భారత పార్లమెంటరీ కమిటీ కూడా అంగీకరించడం దేశ ఆరోగ్య వ్యవస్థ ఎంతగా దిగజారిందో తెలియజేస్తోంది. ఇటీవలి కాలంలో వెలువడుతున్న పరిశోధనాత్మక నివేదికలు భారత ఆరోగ్య రంగం కుప్పకూలే అంచున ఉందని హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రులు మరియు ఫార్మా కంపెనీల మధ్య సాగుతున్న అనైతిక ఒప్పందాలు సామాన్య పౌరుల ప్రాణాలను, వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను చిన్నాభిన్నం చేస్తున్నాయి. జీ న్యూస్ మరియు వివిధ అంతర్జాతీయ ఆరోగ్య సంస్థల గణాంకాల ప్రకారం, దేశంలో జరుగుతున్న మానవ శస్త్రచికిత్సల్లో సుమారు 44% నకిలీవి, మోసపూరితమైనవి లేదా అసలు అవసరమే లేనివి అని తేలడం అత్యంత విషాదకరం. దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో జరుగుతున్న ఈ శస్త్రచికిత్సల వివరాలను నిశితంగా పరిశీలిస్తే, అత్యంత సున్నితమైన గుండె సంబంధిత చికిత్సల్లో దాదాపు 55%వరకు అనవసరమైన ఆపరేషన్లు జరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చిన్నపాటి చికిత్సతో నయమయ్యే సమస్యలకు కూడా స్టెంట్లు వేయడం లేదా బైపాస్ సర్జరీల అవసరం ఉందని రోగులను భయపెట్టి ఆపరేషన్ థియేటర్లకు తరలిస్తున్నారు.**



**ప్రజలు తమను తాము రక్షించుకోవాలంటే వైద్యం పట్ల కనీస అవగాహన పెంచుకోవాలి. అనవసర పరీక్షల గురించి ప్రశ్నించడం, శస్త్రచికిత్సలకు ముందు మరో నిపుణుడి అభిప్రాయాన్ని తీసుకోవడం, జనరిక్ మందుల కోసం పట్టుబట్టడం వంటి చర్యలు కొంతవరకు మేలు చేస్తాయి.**

ఇదే విధమైన దోపిడీ మహిళల ఆరోగ్యం విషయంలో కూడా కొనసాగుతోంది. గర్భాశయ సమస్యలతో వచ్చే మహిళల్లో సుమారు 48% మందికి ఆ అవయవాన్ని తొలగించాల్సిన అవసరం లేకపోయినా, హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించి వారి సహజ శారీరక సమతుల్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే క్యాన్సర్ ఆపరేషన్ల విషయంలో 47%, మోకాళ్ల మార్పిడి సర్జరీల్లో 48%, మరియు సిజేరియన్ డెలివరీల్లో 45% వరకు కేవలం ఆదాయం కోసమే ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని నివేదికలు ఘోషిస్తున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల పనితీరులో వస్తున్న ఈ మార్పులకు ప్రధాన కారణం వైద్యులపై ఉన్న టార్గెట్ల ఒత్తిడి. ప్రస్తుతం పెద్ద ఆసుపత్రుల్లో సీనియర్ వైద్యులకు నెలకు రూ. 1,00,00,000 (ఒక కోటి రూపాయల) వరకు జీతం ఇస్తున్నారంటే, అది వారి ప్రతిభకు మాత్రమే కాదు, వారు ఆసుపత్రికి తెచ్చే వ్యాపారానికి ఇస్తున్న ప్రతిఫలం. ఎక్కువ టెస్టులు రాయడం, ఎక్కువ మందిని అడ్మిట్ చేయించడం లేదా అనవసరమైన ఆపరేషన్లు సూచించే వైద్యులకే యాజమాన్యాలు పెద్దపీట వేస్తున్నాయి. దీనివల్ల వైద్యులు నైతిక విలువలను పక్కనపెట్టి కేవలం ఆదాయం కోసమే పనిచేసే యంత్రాలుగా మారిపోతున్నారు. ప్రతి రక్త పరీక్ష, స్కాన్ లేదా ఎక్స్-రే వెనుక 40% నుండి 50% వరకు కమీషన్లు ఉండటం, రోగికి ఉన్న సమస్య కంటే అతని జేబులో ఎంత డబ్బు ఉందన్న దానిపైనే ఆసుపత్రులు దృష్టి పెట్టడం దురదృష్టకరం. దేశంలోని సుమారు 2,00,000 ల్యాబరేటరీలలో కేవలం 1,000 ల్యాబ్‌లు మాత్రమే సరైన గుర్తింపు కలిగి ఉండటం ఈ వ్యవస్థలోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తోంది. మరోవైపు, హెల్త్ ఇన్సూరెన్స్ రంగం కూడా ఈ దోపిడీకి ఒక వేదికగా మారింది. దేశంలో సుమారు 68% మందికి ఆరోగ్య బీమా ఉన్నప్పటికీ, అవసరమైనప్పుడు క్లెయిమ్ తిరస్కరించబడటం లేదా స్వల్ప మొత్తమే చెల్లించడం జరుగుతోంది. అనేక కార్పొరేట్ ఆసుపత్రులు నకిలీ బిల్లులతో ఇన్సూరెన్స్ కంపెనీలను మోసం చేస్తూ ఇప్పటికే 3,000 వరకు ఆసుపత్రులు బ్లాక్‌లిస్ట్ అయ్యాయి. మరణించిన రోగులను సైతం బ్రతికే ఉన్నారని నమ్మించి, రోజులకు రోజులు వెంటిలేటర్లపై ఉంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ఉదంతాలు మానవత్వానికే మాయని మచ్చగా మిగిలిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆపరేషన్ టేబుల్ మీద రోగి మరణించినా, కుటుంబ సభ్యులకు ఆ విషయం చెప్పకుండా తక్షణమే డబ్బు కట్టాలని ఒత్తిడి చేసి, ఆ తర్వాత మరణించినట్లు ప్రకటించే దారుణాలు నిత్యకృత్యమవుతున్నాయి. అవయవ మార్పిడి రంగంలో సాగుతున్న అక్రమ రవాణా ఈ అరాచకానికి పరాకాష్ట. ఉద్యోగాల పేరుతో లేదా ఉచిత ఆరోగ్య పరీక్షల పేరుతో నిరుపేదలను ఆసుపత్రులకు తీసుకువెళ్లి, వారికి తెలియకుండానే కిడ్నీలు వంటి కీలక అవయవాలను దొంగిలిస్తున్న అంతర్జాతీయ ముఠాలు దేశంలో పాగా వేశాయి. దీనికి తోడు రిఫరల్ మోసం అనే ప్రక్రియ ద్వారా ప్రాథమిక వైద్యులు రోగులను పెద్ద ఆసుపత్రులకు పంపిస్తూ భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. రోగి పరిస్థితి ఎలా ఉన్నా, తమకు వచ్చే కమీషన్ పైనే చాలామంది దృష్టి పెడుతున్నారు. ప్రముఖ ఆసుపత్రులు 40 నుండి 75 మంది వరకు రోగులను పంపిన వైద్యులకు రూ. 1,00,000 నుండి రూ. 2,50,000 వరకు రివార్డులు మరియు విదేశీ పర్యటనలు ఆఫర్ చేస్తున్నాయంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఔషధ కంపెనీల పాత్ర కూడా ఇందులో తక్కువ ఏమీ కాదు. సుమారు 25 పెద్ద ఔషధ కంపెనీలు ప్రతి సంవత్సరం రూ. 1,000 కోట్ల రూపాయలకు పైగా వైద్యులపై ఖర్చు చేస్తున్నాయి. బ్రాండెడ్ మందులను ప్రమోట్ చేయడానికి కంపెనీలు వైద్యులకు ఖరీదైన బహుమతులు మరియు లగ్జరీ స్టేలను ఆశ చూపుతున్నాయి. ఆసుపత్రులు తక్కువ ధరకు కొనుగోలు చేసిన మందులను రోగులకు 10 రెట్లు ఎక్కువ ధరకు విక్రయిస్తూ భారీ లాభాలు గడిస్తున్నాయి. ఉదాహరణకు ఒక క్యాన్సర్ మందును ఆసుపత్రి రూ. 1,950 కు కొనుగోలు చేస్తే, రోగికి మాత్రం రూ. 18,645 కు విక్రయిస్తున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి నియంత్రణ సంస్థలు ఉన్నప్పటికీ, అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. నిబంధనల ప్రకారం వైద్యులు కేవలం జనరిక్ మందులే రాయాలి, చికిత్సకు ముందు ఫీజు వివరాలు వెల్లడించాలి అని ఉన్నా అవి ఎక్కడా అమలు కావడం లేదు. ఈ మొత్తం వ్యవస్థలో బలైపోతున్నది మాత్రం సామాన్య పౌరుడే. ప్రభుత్వం కేటాయించే ఆరోగ్య పథకాలు కూడా అవినీతి అధికారుల, ఆసుపత్రి యాజమాన్యాల చేతుల్లో చిక్కి నిరుపయోగమవుతున్నాయి. ప్రజలు తమను తాము రక్షించుకోవాలంటే వైద్యం పట్ల కనీస అవగాహన పెంచుకోవాలి. అనవసర పరీక్షల గురించి ప్రశ్నించడం, శస్త్రచికిత్సలకు ముందు మరో నిపుణుడి అభిప్రాయాన్ని తీసుకోవడం, జనరిక్ మందుల కోసం పట్టుబట్టడం వంటి చర్యలు కొంతవరకు మేలు చేస్తాయి. ఆరోగ్య హక్కును వ్యాపార వస్తువుగా మార్చిన ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే చట్టాలు కఠినతరం కావడమే కాకుండా, సామాన్య ప్రజల గొంతుకలు కూడా ఏకమవ్వాలి. ఈ విస్తుపోయే నిజాలు ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే వ్యవస్థలో కదలిక వస్తుంది



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863

# రైతుల ప్రయోజనాలపై మోడీ అబద్దాలు

## వాణిజ్య ఒప్పందంపై పెద్ద ఎత్తున నిరసనలు

## భారతీయ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ తికాయత్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 ():** భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామనిభారతీయ కిసాన్ యూనియన్ బికెయు ప్రకటించింది. ప్రధాని నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను తగలబెడతామని తెలిపింది. బికెయు నేత రాకేశ్ తికాయత్ న్యూఢిల్లీలో విలేకరులతోమాట్లాడుతూ రైతుల ప్రయోజనాల పరిరక్షణ గురించి మోడీ ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని విమర్శించారు. 1992లో భారత్ తన ఆర్థిక వ్యవస్థతలుపులు తెరిచి విదేశాలను అనుమతించిందని, ప్రస్తుత పరిస్థితి కూడాఅలాగే ఉన్నదని ఆయన చెప్పారు. 'భారత్-అమెరికా ఒప్పందం జరిగినతీరు చూస్తుంటే అది మన దేశానికి ప్రమాదకారిగా కన్పిస్తోంది. కాబట్టిదానిపై మనం గళం విప్పాల్సిందే' అని అన్నారు. ఇది ఏకపక్ష ఒప్పందమని ,ఒత్తిడితో కుదుర్చుకున్నదని తికాయత్ చెప్పారు. ఈ ఒప్పందం భారతరైతులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. అమెరికామన దేశంలోకి సబ్సిడీతో కూడిన వస్తువులను కుమ్మరిస్తుందని, ఫలితంగామన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించలేరని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడతామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీని విలేకరులు ప్రస్తావించగా 'అది అబద్ధం చెబుతోంది. వారు ఏమైనా చెప్పుకోనివ్వండి. నిరసనలు తప్పవు' అని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మలను గ్రామాలలో రైతులు దగ్ధం చేస్తారని, ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలుపుతారని అన్నారు. 'మా ట్రాక్టర్లకు ఢిల్లీ ఎంతో దూరంలో లేదు. అవి సిద్ధంగానే ఉన్నాయి' అని వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం భారత్‌కు న్యాయసమ్మతం కాదని ఆర్జేడీ ఎంపి సుధాకర్ సింగ్ చెప్పారు. ఇది ఉభయులకూ ప్రయోజనకరమైన ఒప్పందం కాదని, భారత్ 18 శాతం సుంకం కడుతుంటే అమెరికా మాత్రం సున్నా టారిఫ్‌కే పరిమితమవుతోందన్నారు. ప్రతిపాదిత విత్తన బిల్లును కూడా ఆయన వ్యతిరేకించారు. రైతులు అధిక ధరకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. అమ్‌ఆద్మీ పార్టీ ఎంపి సంజరు సింగ్, ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.



# కాన్పూర్‌లో పాదచారులపై లంబోర్గిని కారు

## ఘటనలో వ్యాపారవేత్త కుమారుడి అరెస్ట్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారుల పైకి లంబోర్గిని కారు దూసుకెళ్లిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారును నడిపిన ప్రముఖ పొగాకు వ్యాపారి కేకే మిశ్రా కుమారుడు శివంను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత ఈ అరెస్టు చోటుచేసుకుంది. కాన్పూర్‌లోని వీఐపీ రోడ్‌లో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న లంబోర్గిని కారు ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న పాదచారులు, వాహనాల పైకి అది దూసుకెళ్లింది. దీనికి ముందు ఈ లగ్జరీ కారు ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడిని అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. బుధవారం ఈ కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన లంబోర్గిని కారును నడిపింది శివం కాదు.. తానే అంటూ మోహన్ అనే వ్యక్తి కాన్పూర్ కోర్టులో లొంగిపోవడానికి వచ్చాడు. ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు శివం మూర్ఛపోయాడని.. అతడిని ఒక చేత్తో పట్టుకొని కారు నడిపానని వెల్లడించారు. ఈ క్రమంలో కారు ఓ ఆటోని ఢీకొట్టిందని ఆ తర్వాత డివైడర్‌ను ఢకోట్టి ఆగిపోయిందని వెల్లడించాడు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో లాకింగ్ సిస్టమ్ వల్ల తాను బయటకు రాలేకపోయానని, శివంను డ్రైవర్ సీటులోకి మార్చి.. తాను మరో సీటులోకి వెళ్లినట్లు వివరించాడు. అయితే, ప్రమాద సమయంలో కారు నడిపింది శివం మిశ్రానే అని పోలీసులు నిర్ధరించారు. ఘటన అనంతరం అతడిని డ్రైవర్ సీటు నుంచి బయటకు తీసిన వీడియోలు కూడా వెలువడ్డాయి. పోలీసుల వాదనలను గమనించిన న్యాయస్థానం మోహన్ లొంగిపోవడాన్ని నిరాకరించింది. దీనిపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలని పోలీసులను కోరింది. ఘటనా సమయంలో కారు నడుపుతున్నది తానేనని, మిశ్రా కాదని ఒక వ్యక్తి స్థానిక కోర్టుకు వెళ్లి బుధవారం లొంగిపోయారు. అయితే మిశ్రా వాహనం నడిపాడనీ నిరూపించడానికి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని పోలీసులు నిర్ధారించారు. కోర్టు ఎదుట లొంగిపోయేందుకు ఆయన పెట్టుకున్న అభ్యర్ధనను కోర్టు తిరస్కరించింది. గురువారం ఉదయం పోలీసులు అతనిని అరెస్ట్ చేశారని, కోర్టు ఎదుట హాజరుపరుస్తారని పోలీస్ కమిషనర్ రఘుబీర్‌లాల్ తెలిపారు. మిశ్రాను ఢిల్లీలోని ఒక ఆస్పత్రి నుండి అదుపులోకి తీసుకున్నారని అన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 18ఏళ్ల ఈ రిక్షా డ్రైవర్ మహ్మద్ తాఫీక ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు.



నినాదం
నిఖార్సైన జర్నలిజం

# బసవతారకంలో అంతర్జాతీయ వైద్య సదస్సు

**పాలియేటివ్ కేర్ బలోపేతానికి వర్క్‌షాప్**

**గ్లోబల్ నర్సింగ్ నేతృత్వంపై నిపుణుల చర్చలు**




**హైదరాబాద్,ఫిబ్రవరి** హైదరాబాద్‌లోని బసవతారకంఇండో--అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి దాని పరిశోధనా సంస్థలోభారతీయ పాలియేటివ్ కేర్ సంఘం 33వ వార్షిక అంతర్జాతీయసదస్సు ప్రీ-సదస్సు వర్క్‌షాప్‌తో ప్రారంభమైంది. "ఈఎల్ఎన్ఈసీ,దాని తర్వాత: నిరంతర పాలియేటివ్ సంరక్షణ మార్పుల కోసం గ్లోబల్ నర్సింగ్ నాయకత్వ బలోపేతం" అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. దీనికి దేశవ్యాప్తంగా వైద్యులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలియేటివ్ కేర్ కరుణతో కూడిన సమగ్ర సేవ అని వక్తలు పేర్కొన్నారు. ఆంకాలజీ--పాలియేటివ్ సమన్వయం ద్వారా రోగులకు గౌరవప్రదమైన సంరక్షణ అందుతుందని తెలిపారు. అంతర్జాతీయ నిపుణులు పాలియేటివ్ కేర్‌లో వినూత్న పరిశోధనలు, బహుశాఖ బృంద సమన్వయం, సంరక్షకుల సాధికారత, దూర పర్యవేక్షణలో సాంకేతిక వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. స్పార్ష్ హాస్పిస్‌తో కలిసి నిర్వహించిన ఈ సదస్సు, దేశంలో పాలియేటివ్ కేర్ విద్యా-సేవల అభివృద్ధికి కీలక వేదికగా నిలిచింది. కాగా ప్రారంభోత్సవంలో ఆసుపత్రి ప్రధాన కార్యనిర్వాహక అధికారి డా. కె. కృష్ణయ్య, వైద్య సంచాలకులు డా. టి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, సంఘం అధ్యక్షురాలు డా. గీతా జోషి తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరగటానికి కట్టుదిట్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు

**ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్**



**వికారాబాద్, ఫిబ్రవరి** : వికారాబాద్‌లో జిల్లా మునిసిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలుతీసుకొని పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లుజిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు.ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా, జిల్లాలోని నాలుగుమునిసిపల్ పట్టణాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్అమలులో ఉన్న నేపథ్యంలో, అదేవిధంగాకౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో, విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు,బాణాసంచా కాల్చడం, డీజే సౌండ్ సిస్టమ్‌లవినియోగం పూర్తిగా నిషేధించబడినట్లు జిల్లా ఎస్పీతెలిపారు. ఫలితాలు వెలువడిన అనంతరం కూడాప్రజలు సంయమనం పాటించాలని, ఉత్సాహంలోఏలాంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవద్దని ఆమె తెలిపినారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిర్దిష్ట పరిధిలోనీ ఆర్ పి సీ 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. ఈ సెక్షన్ అమలులో ఉన్న సమయంలో ఐదుగురికి మించి గుమికూడడం, నినాదాలు చేయడం, లౌడ్ స్పీకర్లు, డీజేలు, సౌండ్ బాక్స్‌లు లేదా ఇతర శబ్ద విస్తరణ పరికరాల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. జిల్లాలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద కదలికలపై నిఘా కోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, డీజే యజమానులు, ఈవెంట్ నిర్వాహకులు వారి అనుచరులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా పూర్తయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు.

# సైబరాబాద్ 24వ ఆవిర్భావ దినోత్సవం

**నార్సింగి సైకిల్ ట్రాక్‌పై హోరెత్తిన సైకిల్ ర్యాలీ**



**రాజేంద్రనగర్ ఫిబ్రవరి12** : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ 24వ ఫౌండేషన్ డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం నార్సింగి సైకిల్ ట్రాక్ వద్ద నిర్వహించిన భారీ సైకిల్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ, ఫిట్‌నెస్, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ?ముఖ్య అతిథిగా సీపీ రమేష్ ?సైబరాబాద్ పోలీస్ కమిషనర్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా సైకిల్ తొక్కుతూ పోలీసు సిబ్బందిని, విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబరాబాద్ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**ఉత్సాహంగా సాగిన ర్యాలీ**

సుమారు రెండు కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీలో పోలీసు అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైబరాబాద్ సురక్షితంగా శాంతియు తంగా ఉండాలి అంటూ నినాదాలు చేస్తూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు సైకిల్ తొక్కడమే కాకుండా స్ఫూర్తిదాయకరమైన పాటలు పాడుతూ నినాదాలు చేస్తూ వాహనాన్ని ఉల్లాసంగా మార్చేశారు ఫిట్నెస్ ప్రాముఖ్యతను చాటి చెబుతూ సాగిన ఈ ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డిసిపి రీతురాజ్,శేర్లింగంపల్లి డిసిపి చింతమనేని శ్రీనివాస్, నార్సింగి సిఐ హరికృష్ణ రెడ్డి, ట్రాఫిక్ సిఐ, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, ఫిబ్రవరి** ): ఈనెల 11 న జరిగిన మున్సిపల్ఎన్నికల కు సంబంధించిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా కేంద్రంలో ఎస్ ఏ పి కాలశాలలో ని లెక్కింపు కోసం ఏర్పాటుచేసిన ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగాసంబంధిత అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లు సక్రంగా ఉండాలనిసూచించారు. నిబంధనలకు లోబడి ఓట్ల లెక్కింపు ఉండాలని అన్నారు.సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. కలెక్టర్ తో పాటు మున్సిపల్‌కమిషనర్ విక్రంసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

# జిల్లాలోని మున్సిపాలిటీ ఎన్నికల లెక్కింపునకు సర్వం సిద్ధం

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి**





**మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 12** మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ లసాధారణ ఎన్నికల 2026లో భాగంగామేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీ లలో ఓట్ల లెక్కింపు కోసం అలియాబాద్ మున్సిపాలిటీకి సంబంధించిన మజీద్పూర్ లోని శ్రీ టి చైతన్య హై స్కూల్ లో, మూడు చింతలపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన జగ్గం గూడాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ లో, ఎల్లంపేట్ మున్సిపాలిటికి సంబంధించి బైబిల్ కాలేజీ లలో 14 టేబుళ్లతో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఒక్కొక్క టేబుల్ కు ఒక సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లతో కలిపి మొత్తం 153 సిబ్బందితో ఉదయం 8 గంటల నుండి మొదలు పెట్టి ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం సిసి కెమెరాల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు మధ్య నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజల ప్రశాంతతకు ఎటువంటి భంగం వాటిల్లకుండా, ముందస్తు భద్రతలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండడానికి లెక్కింపు కేంద్రాల పరిసర ప్రాంతాలలో 500రేడియస్ లోపల ఐదుగురికి మించి గుమిగూడరాదని, నిబంధనలు అతిక్రమించినట్లయితే చట్టరీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.


# కేంద్ర రైల్వే సహాయ మంత్రిని కలిసిన ఎంపి కొండా విశవేశ్వర్ రెడ్డి




**వికారాబాద్, ఫిబ్రవరి** : చేవెళ్ల పార్ల మెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్నటువంటి రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ బ్రిడ్జిల పనులు సత్వరమే చేపట్టాలని కోరుతూ గురు వారం ఢిల్లీలోని రైలు భవన్ రైల్వే మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి వి సోమన్న ను చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం శంకరపల్లి ప్రాంతానికి విచ్చేసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు కూడా ఈ మేరకు వినతిపత్రం అందజేసినట్టు ఆయన వివరించారు. అదేవిధంగా నావంద్గి రైల్వేస్టేషన్ లో హుబ్లీ ఎక్స్ప్రెస్ రైలు నిలపడానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూల ప్రతిపాదన పంపడం జరిగిందని, దానికి అనుగుణంగా రైల్వే బోర్డు ద్వారా తక్షణం హుబ్లీ ఎక్స్ప్రెస్ రైలును ఆపడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు ఆయన విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ పట్టణం లోని జిల్లా కోర్టు సమీపంలో, రామయ్య గూడా ప్రాంతాలలో ఉన్నటు వంటి రైల్వే లెవెల్ క్రాసింగ్ ల వద్ద డిపిఆర్ లు పూర్తయిన దృష్ట్యా ఆర్ఓబి, ఆర్యుబిల నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొండకల్, ముబారక్ పూర్, మర్పల్లి, పాత శంకర్పల్లి, మొరంగుపల్లి, గేట్ వనంపల్లి, గొల్లగూడ, నావంద్గి, సిద్ధాంతి, శాతం రాయి, ఫతేపూర్ ఎల్.హెచ్.ఎస్ ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా రైల్వే మంత్రి సానుకూలంగా స్పందినట్లు పేర్కొన్నారు.

TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.జి.ఎల్

# అప్పలసూరిగా జగపతిబాబు




ఒకప్పటి ఫ్యామిలీ హీరో, ప్రస్తుతం స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా దూసుకుపోతున్న జగపతి బాబు తాజాగా తన లుక్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా కోసం ఆయన పూర్తిగా మారిపోయిన కొత్త రూపం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోను చూసిన నెటిజన్లు ఇతను జగపతి బాబా అంటున్నారు. ఈ చిత్రంలో జగపతి బాబు 'అప్పల సూరి' అనే కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఆ పాత్ర కోసం ఆయన బాగా బరువు తగ్గి, వయసు ముదిరిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా విడుదలైన సెట్స్ ఫోటోలో దర్శకుడు బుచ్చిబాబుతో మాట్లాడుతున్న జగపతి బాబు రూపం చూసి అభిమానులు షాక్ అవుతున్నారు. ఏ కోణంలో చూసినా ఆయన గుర్తుపట్టలేనంతగా మారిపోయారని పలువురు అభిప్రాయపడుతున్నారు. జగపతి బాబు బర్త్ డే సందర్భంగా ఈ పిక్ రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో కూడా జగ్గూ భాయ్‌కి సంబంధించిన పిక్ ఒకటి షేర్ చేయగా, అది కూడా నెట్టింట వైరల్ అయింది. ఇక జగపతి బాబు గతంలో కూడా పాత్ర కోసం తన లుక్‌ను పూర్తిగా మార్చుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి 'పెద్ది' కోసం తీసుకున్న మేకోవర్ మాత్రం మరింత విభిన్నంగా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన, తర్వాత విలన్ మరియు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించి వరుస విజయాలతో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇక రామ్ చరణ్ – జగపతి బాబు కాంబినేషన్ ఇప్పటికే 'రంగస్థలం' చిత్రంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఈ జోడీ 'పెద్ది'లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతుండగా, జగపతి బాబు పోషిస్తున్న పాత్ర ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలనే ఉత్సుకత సినీ ప్రియుల్లో నెలకొంది. మొత్తానికి, 'పెద్ది' కోసం జగపతి బాబు చేసిన ఈ భారీ మేకోవర్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.




# సుహాస్ వైవిధ్యంగా హే భగవాన్






వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో సుహాస్, తాజాగా 'హే భగవాన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సీనియర్ నటుడు నరేష్ తన కుటుంబ వ్యాపారాన్ని రహస్యంగా నిర్వహిస్తుంటారు. ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే నిబంధన ఉంటుంది. అయితే తన తండ్రి వ్యాపారాన్ని సుహాస్ టేకోవర్ చేద్దామనుకుంటాడు. ఈ క్రమంలో ఎదురయ్యే సంఘటనలు ఏంటి అనేది ఈ చిత్ర కథాంశం. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తర్వాత సుహాస్ మరియు శివానీ నాగారం మరోసారి జోడీ కట్టడం ఈ సినిమాపై అంచనాలను పెంచుతోంది. దర్శకుడు గోపీ అచ్చర ఈ చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించడమే కాకుండా, లకైమాక్స్‌లో ఒక మంచి ఎమోషనల్ టచ్ కూడా ఉంటుందని తెలిపారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ నిర్మించగా, బన్నీ వాస్ వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్నారు.

# 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్ మార్చండి



మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఘూస్‌ఖోర్ పండత్' సినిమా టైటిల్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దానిని తక్షణమే మార్చాలని నిర్మాతలను ఆదేశించింది. మనోజ్ బాజ్‌పేయి ప్రధాన పాత్రలో నీరజ్ పాండే, రితేశ్ షా సంయుక్త దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా టైటిల్ ఓ వర్గాన్ని కించపరిచేలా ఉందని సుప్రీకోర్టులో పిటిషన్ దాఖలుకాగా.. ఈ పిటిషన్‌ని విచారించిన ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ, వాక్ స్వాతంత్ర్యం పేరుతో ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదని, సమాజంలో ఇప్పటికే ఉన్న విభేదాలను ఇలాంటి టైటిళ్లతో మరింత పెంచవద్దని ఘాటుగా వ్యాఖ్యానించింది. 'పండత్' అనే పదానికి 'ఘూస్‌ఖోర్' (అవినీతిపరుడు) అనే పదాన్ని చేర్చడం వల్ల బ్రాహ్మణ సామాజిక వర్గ మనోభావాలు దెబ్బతింటున్నాయని దాఖలైన పిటిషన్లను పరిగణనలోకి తీసుకున్న కోర్టు, కొత్త పేరును ఖరారు చేసి అఫిడవిట్ దాఖలు చేసే వరకు సినిమా విడుదలకు అనుమతి లేదని స్పష్టం చేస్తూ స్టే విధించింది. దీనిపై స్పందించిన నెట్‌ఫ్లిక్స్ మరియు దర్శకుడు నీరజ్ పాండే బృందం, కోర్టు ఆదేశాల మేరకు టైటిల్‌ను మారుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లు, టీజర్లను తొలగించగా, తదుపరి విచారణ ఫిబ్రవరి 19న జరగనుంది.


# యువతరానికి కనెక్ట్ అయ్యే హుషారు పిట్టలు



టాలీవుడ్ యువ నటులు అన్ను, వాసవి గణెలిషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సురేష్ ఫిలింస్ విడుదల చేస్తుండగా. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ.. నిర్మాత బెక్కం వేణుగోపాల్ ద్వారా ఈ సినిమా గురించి తెలిసిందని, సినిమా చూడగానే ఇది నేటి యువతరానికి బాగా కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ మూవీ అనిపించిందని ప్రశంసించారు. చిత్రంలోని నటీనటులందరూ అద్భుతంగా నటించారని, ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 16 ఏళ్ల కష్టానికి ప్రతిఫలంగా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కావడం ఆనందంగా ఉందన్నారు. తన నిజజీవితంలో చుట్టుపక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా, యువతతో పాటు తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక బాధ్యతాయుతమైన కథను వినోదాత్మక శైలిలో రూపొందించానని తెలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థ ద్వారా సినిమా విడుదల కావడం తన అదృష్టమని పేర్కొన్నారు.నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూసినప్పుడు తనకు షాకింగ్‌గా అనిపించిందని, ప్రథమార్థం యూత్‌ఫుల్‌గా ఉంటూనే ద్వితీయార్థంలో ఎంతో మెచ్యూర్డ్ కంటెంట్ ఉంటుందని చెప్పారు. కంటెంట్ నచ్చడం వల్లే సురేష్ బాబు ఈ సినిమాను సపోర్ట్ చేస్తున్నారని, ఇది అందరిలో బాధ్యతను పెంచే చిత్రమని తెలిపారు.హీరో అన్ను తాను మాసినపల్లి రవి పాత్రలో కనిపిస్తానని చెప్పగా, హీరోయిన్ వాసవి గణెలిషన్ తన తొలి చిత్రంలోని పాత్ర అందరికీ నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కథపై నమ్మకంతో ఈ సినిమాను నిజాయితీగా నిర్మించామని, యువతకు మంచి సందేశాన్ని ఇస్తుందని తెలిపారు.



# వెంకీ అట్లూరితో నాని మూవీకి ప్లాన్




స్టార్ కథానాయకుడు నాని ప్రస్తుతం వరుస హిట్లతో జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న నాని ఆ తర్వాత సుజిత్ దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ రెండు చిత్రాలు కాకుండా మరో క్రేజీ దర్శకుడితో నాని చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. 'సార్', 'లక్కీ భాస్కర్' వంటి వైవిధ్యమైన చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు వెంకీ అట్లూరితో నాని సినిమా చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మించబోతున్నాడు. 'జెర్సీ' వంటి నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమా తర్వాత నాని ? సితార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం మార్చి 26, 2026న విడుదలయ్యే అవకాశం ఉంది. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నారు. మరోవైపు వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా 'విశ్వనాథన్ అండ్ సన్స్'చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ కమిట్‌మెంట్లు అన్నీ పూర్తయిన తర్వాత, 2026 ద్వితీయార్థంలో నాని ? వెంకీ అట్లూరి ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# విజయ్ దేవరకొండ పెళ్లి

**ఓటిటి హక్కులు తిరస్కరించిన రౌడీబాయ్**



టాలీవుడ్ మోస్ట్ క్రేజీ నటులుగా పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్లో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వీరి పెళ్లి వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక ప్రముఖ అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ఈ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. గతంలో నయనతార ? విఘ్నేష్ శివన్ వివాహ వీడియో స్ట్రీమింగ్ విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలు, డాక్యుమెంటరీ విడుదల కావడానికి పట్టిన సమయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ జంట అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. అలాగే తన వ్యక్తిగత జీవితంలోని అత్యంత ముఖ్యమైన వేడుకను వ్యాపారం చేయడం విజయ్‌కి ఇష్టం లేదని, అందుకే ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. తమ పెళ్లిని కేవలం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య అత్యంత ప్రైవేట్‌గా జరుపుకోవాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో వీరి వివాహం జరగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా ప్రారంభ మయ్యాయని నెట్టింట కొన్ని వీడియోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లోనే వీరిద్దరికీ నిశ్చితార్థం పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, ఈ జంట మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# ఆ ట్రోఫీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా

**రోహిత్ శర్మ**



**ఢిల్లీ : టీమ్ఇండియా స్టార్‌బ్యాటర్ వన్డే వరల్డ్‌కప్ 2027 గురించి కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. అతడు ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్‌లో పాల్గొనడమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నాడు. అయితే అతడిని ఎంపిక చేస్తారా.. లేదా.. అనే విషయంలో మాత్రం ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ శర్మ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.**

'నా దేశం కోసం వరల్డ్ కప్ నెగ్గాలని నేను కోరుకుంటున్నాను. వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు చూస్తూ నేను పెరిగాను. అప్పట్లో టీ20 వరల్డ్‌కప్ కానీ, ఐపీఎల్ కానీ లేవు. వన్డే వరల్డ్‌కప్ ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జరుగుతుంది. దానికి చాలా విలువ ఉంది. నాకు ఆ ట్రోఫీ గెలవాలని ఉంది. దాన్ని పొందేందుకు నేను నా శక్తివంచన లేకుండా కృషి చేస్తా' అని రోహిత్ శర్మ ఒక ఐసీసీ ఈవెంట్‌లో అన్నాడు.

బీసీసీఐ ఇటీవల ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో రోహిత్‌శర్మ గ్రూప్ బిలోకి మారాడు. ఇంతకుముందు అతడు ఏ లో ఉండేవాడు. ప్రస్తుతం బీసీసీఐ ఆ కేటగిరీని తొలగించింది. కేవలం ఏ, బీ, సీ కేటగిరీలను మాత్రమే కేటాయించింది. శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా మాత్రమే గ్రూప్ ఏలో స్థానం దక్కించుకున్నారు.

# అదరగొట్టిన వెస్టిండీస్.. ఇంగ్లాండ్‌పై విజయం

**రూథర్‌ఫర్డ్ 76 నాటౌట్**




**ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం గ్రూప్-సి మ్యాచ్‌లో ఆ జట్టు 30 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రూథర్‌ఫర్డ్ (76 నాటౌట్; 42 బంతుల్లో 2×4, 7×6) విరుచుకుపడడంతో మొదట వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు**

చేసింది. హోల్డర్ (33; 17 బంతుల్లో 1x4, 4x6), ఛేజ్ (34; 29 బంతుల్లో 6x4) రాణించారు. తొలి 10 ఓవర్లలో 79/4తో నిలిచిన విండీస్, రూథర్‌ఫర్డ్ జోరుతో చివరి 10 ఓవర్లలో 117 పరుగులు రాబట్టింది. అతడు.. పావెల్ (14)తో అయిదో వికెట్‌కు 51, హోల్డర్‌తో ఆరో వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో అదిల్ రషీద్ (2/16), ఒవర్టన్ (2/33) మెరుగైన ప్రదర్శన చేశారు. ఛేదనలో ఇంగ్లాండ్ తడబడింది. మోటీ (3/33), ఛేజ్ (2/29) ధాటికి 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటైంది. జోసెఫ్ (1/30), అకీల్ హొసీన్ (1/32) కూడా రాణించారు. సామ్ కరన్ (43 నాటౌట్; 30 బంతుల్లో 3x4, 2x6) టాప్ స్కోరర్. బెతెల్ (33), సాల్ట్ (30) పర్వాలేదనిపించారు. 35 పరుగుల వ్యవధిలో ఇంగ్లాండ్ తన చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. తొలి మ్యాచ్‌లో నేపాల్ మీద అతి కష్టం మీద గెలిచిన ఇంగ్లాండ్.. ఈ మ్యాచ్‌లో ఓటమి తప్పించుకోలేకపోయింది. సంక్షిప్త స్కోర్లు... వెస్టిండీస్: 196/6 (రూథర్‌ఫర్డ్ 76 నాటౌట్, ఛేజ్ 34, హోల్డర్ 33; రషీద్ 2/16, ఒవర్టన్ 2/33); ఇంగ్లాండ్: 19 ఓవర్లలో 166 ఆలౌట్ (సామ్ కరన్ 43 నాటౌట్, బెతెల్ 33; మోటీ 3/33, ఛేజ్ 2/29)

# కొలంబోలో పిచ్‌ను ఎప్పుడైనా మార్చొచ్చు

**పాక్ మాజీ క్రికెటర్**




**కొలంబో : టీ20 వరల్డ్‌కప్ 2026లో భాగంగా ఆదివారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగనుంది. దీనిపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సక్లయిన్ ముస్తాక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఐసీసీని బీసీసీఐ ప్రభావితం చేస్తుందన్నాడు. ప్రస్తుతమున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొలంబోలోని పిచ్‌ను ఎప్పుడైనా మార్చొచ్చని నిరాధార ఆరోపణలు చేస్తూ.. తన అక్కసు వెళ్లగక్కాడు.**

'ఐసీసీ ఎవరి ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తుందో మనందరికీ తెలుసు. ప్రస్తుత ఆధునిక కాలంలో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఉందంటే.. దాని సాయంతో మనకు తెలియకుండానే గ్రౌండ్స్‌మెన్ ఎప్పుడైనా పిచ్‌ను మార్చొచ్చు' అని సక్లయిన్ ముస్తాక్ అన్నాడు. అలాగే అతడు బౌలింగ్ ఆర్డర్ గురించి మాట్లాడాడు. 'భారత్‌తో మ్యాచ్‌కు ముందు ఉస్మాన్ తారిక్ ఆత్మవిశ్వాసాన్ని పొందాడు. కానీ మీకు ఇద్దరు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్ అవసరమైతే మొత్తం సమీకరణం మారిపోతుంది.

జిమ్మీ నీషమ్‌ను చూడండి. అతడు ఫహీమ్ అష్రఫ్ లాంటివాడు. పాకిస్థాన్ తరఫున 20వ ఓవర్ ఎవరు వేస్తారు? తారిక్? నవాజ్? షాదాబ్? అబ్రార్? వారు చివరిగా ఎప్పుడు 20వ ఓవర్ వేశారు. ఫహీమ్ 20వ ఓవర్ వేయగలడో.. లేదో..' అని సక్లయిన్ విశ్లేషించాడు. హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ తన మ్యాచ్‌లన్నీ శ్రీలంక వేదికగానే ఆడుతోంది. ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడిన పాకిస్థాన్ రెండింట్లోనూ నెగ్గింది. అమెరికాతో మ్యాచ్ నెగ్గిన భారత్.. మరికొన్ని గంటల్లో నమీబియాతో అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా తలపడనుంది. టీమ్ఇండియా, పాక్ మధ్య కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో ఆదివారం మ్యాచ్ జరగనుంది.

# అర్ష్‌దీప్ 'స్వింగ్'..

## మరో నాలుగు వికెట్లు తీస్తే..!



**ఢిల్లీ : బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ బ్యాటర్లను బోల్తా కొట్టించే టీమ్ఇండియా ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. మరి కొన్ని గంటల్లో నమీబియాతో జరగనున్న మ్యాచ్‌లో ఆ మైలురాయిని చేరుకునే అవకాశముంది. ఇంతకీ అర్ష్‌దీప్ సింగ్ సాధించబోయే ఘనత ఏంటంటే.. మరో నాలుగు వికెట్లు తీస్తే అతడు టీ20 ప్రపంచకప్ మ్యాచుల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలుస్తాడు.**

ప్రస్తుతం ఈ రికార్డ్ టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ పేరిట ఉంది. అతడు 2024 డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అశ్విన్ తన కెరీర్లో 24 టీ20 వరల్డ్ కప్ మ్యాచులు ఆడి 32 వికెట్లు తీసుకున్నాడు. ప్రస్తుతం అర్ష్‌దీప్ సింగ్ ఖాతాలో 29 వికెట్లున్నాయి. అతడు కేవలం 15 మ్యాచుల్లో ఈ వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అతడి తర్వాత స్థానాల్లో జస్‌ప్రీత్ బుమ్రా (18 మ్యాచులు, 26 వికెట్లు), హార్దిక్ పాండ్య (25 మ్యాచులు, 24 వికెట్లు), రవీంద్ర జడేజా (30 మ్యాచులు, 22 వికెట్లు) ఉన్నారు.

అర్ష్‌దీప్ సింగ్.. జులై 2022లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో టీ20ల్లో అరంగేట్రం చేశాడు. అతడి మొదటి టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా పాకిస్థాన్‌తో 23 ఫిబ్రవరి 2022న ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతడు 32 పరుగులిచ్చి, నాలుగు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రోహిత్ శర్మ సారథ్యంలో టీ20 వరల్డ్‌కప్ 2024లో ఎనిమిది మ్యాచుల్లో 17 వికెట్లు తీసుకున్నాడు. పొట్టిఫార్మాట్లో ఒక ఎడిషన్‌లో ఎక్కువ వికెట్లు తీసుకున్న బౌలర్‌గా వరల్డ్ రికార్డ్ సృష్టించాడు.

ఓవరాల్‌గా టీ20 వరల్డ్‌కప్ మ్యాచుల్లో ఎక్కువ వికెట్లు తీసుకున్న రికార్డ్ మాత్రం బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ పేరిట ఉంది. అతడు 2007 నుంచి 2024 మధ్య 43 మ్యాచుల్లో 50 వికెట్లు తీసుకున్నాడు.

# సంజు శాంసన్ ఈసారైనా..

## అవకాశాన్ని అందిపుచ్చుకుంటాడా?



**ఢిల్లీ : అభిషేక్ శర్మ ఉదర సంబంధ సమస్యతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రి పాలయ్యాడు. ప్రస్తుతం అతడు డిశ్చార్జి అయినప్పటికీ.. పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా మరికొన్ని గంటల్లో నమీబియాతో ప్రారంభం కానున్న మ్యాచ్ ఆడతాడా అనేది అనుమానంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పసికూనతో మ్యాచ్‌లో అభిషేక్ శర్మను ఆడించే సాహసం టీమ్ మేనేజ్‌మెంట్ చేయకపోవచ్చు. దీంతో ఈ మ్యాచ్‌లో సంజుశాంసన్ .. ఇషాన్ కిషన్‌తో కలిసి ఓపెనర్‌గా వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.**

### వరుసగా విఫలమై.. దూరమై..

పొట్టి ప్రపంచకప్‌నకు ముందు న్యూజిలాండ్‌తో జరిగిన అయిదు టీ20 సిరీస్‌లో సంజుశాంసన్ వరుసగా విఫలమయ్యాడు. ఆ అయిదు మ్యాచుల్లో.. 10, 6, 0, 24, 6 పరుగులు మాత్రమే చేశాడు. మొత్తంగా అయిదు మ్యాచుల్లో కలిపి కేవలం 46 రన్స్ చేశాడు. దీంతో ప్రపంచకప్ తుది జట్టులో స్థానం కోల్పోయాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లోనూ ప్లేయింగ్ ఎలెవన్‌లో లేడు. అతడి ప్లేస్‌లో ఇషాన్ కిషన్ జట్టులో పాతుకుపోయే ప్రయత్నంలో ఉన్నాడు.

### ఫామ్ అందుకుంటాడా..

ఫామ్ కోల్పోవడం కెరీర్‌లో ఏ క్రికెటర్‌కైనా మామూలే. అయితే ఎంత త్వరగా తిరిగి గాడిలో పడతాడనేదే కీలకం. ముఖ్యంగా తీవ్రమైన పోటీ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ఎంతో ముఖ్యం. ఒకవేళ నమీబియాతో జరగబోయే మ్యాచ్‌లో సంజుశాంసన్‌కు అవకాశం వస్తే.. కచ్చితంగా రాణించాల్సిన పరిస్థితి. ఈ మ్యాచ్‌లోనూ విఫలమైతే ఇక దాదాపు అతడికి దారులు మూసుకుపోయినట్లే. ఇప్పటికే తుది జట్టులో స్థానాన్ని కోల్పోయిన సంజు.. ఇలాగే ఫేలవ ఫామ్ కొనసాగిస్తే అతడి పేరు 15 మంది సభ్యుల జాబితాలోనూ గల్లంతయ్యే అవకాశముందని అభిమానులు, క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail:
ninadamnews@gmail.com, CELL: +91 8333068787